# తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు

సంపాదకుడు :

**ఎన్. వేణుగోపాల్**

విప్లవ రచయితల సంఘం

ఆంధ్రప్రదేశ్

**తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు**

*ముద్రణ*
**జనవరి 2006**

*ప్రచురణ :*
**విరసం**, ఆంధ్రప్రదేశ్

*వెల : 150 రూపాయలు*

*కవర్ కాన్సెప్ట్* : **తుమ్మేటి రఘోత్తమరెడ్డి**
*పెయింటింగ్* : **అన్నవరం శ్రీనివాస్**

*సోల్ డిస్ట్రిబ్యూషన్*
**నవోదయ బుక్‌హౌస్**
ఆర్యసమాజ్ ఎదురువీధి,
కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్.
ఫోన్ : 27678471

---

*ముద్రణ :*
**చరిత ఇంప్రెషన్స్**
అజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 27678411

**మా అక్కయ్య సౌభాగ్యవతి స్మృతికి...**

**-రఘోత్తమరెడ్డి**

...ఈ కథలు నేను యింతకుముందు చాలావరకు చదివాను. ఆవిష్కరణ సందర్భంలో మాట్లాడ్డం కోసం మళ్ళీ చాలావరకు చదివాను. ఇరవై - యిరవై అయిదేళ్ళ కిందట తెలంగాణలో ఏం జరిగిందో నాకు చాలా వరకు తెలుసు. అనేక ఉద్యమాలు - రైతాంగ ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు, ఆదివాసీ ఉద్యమాలు, సారా వ్యతిరేక పోరాటాలు జరిగాయి. వాటి గురించి ఆ రోజు తెలిసినవాటికంటే కూడ ఈ కథలు యిప్పుడు చదువుతుంటే యింకా అనేక కొత్త విషయాలు తెలిశాయి. బహుశా సాహిత్యం చేసేపని యిదే అని విమర్శకులు అంటుంటారు. నాకు అలాంటి అనుభవమే కలిగింది.

రఘోత్తమరెడ్డి తాను కథ రాద్దామనుకున్న దాన్ని చాలా లోతుగా చూస్తాడని, మానవ సంబంధాల్లో, విలువల్లో ఉద్యమాలు తీసుకువస్తున్న ఘర్షణను సంక్లిష్టంగా, ప్రతిభావంతంగా చిత్రిస్తాడని ఈ కథలు చదివితే ఎవరికైనా తెలుస్తుంది. రాజకీయ ఆందోళనలు, ఉద్యమాలు సమాజంపై తీసుకువచ్చే వత్తిడి, ప్రభావం వల్ల మనుషుల చైతన్యంలో ఏ మార్పు వస్తుంది? అసలు ఆ చైతన్యంలో ఏ మార్పు సాధించాలనే లక్ష్యంతో ఉద్యమాలు జరుగుతాయి? అవి ఎలాంటి ఫలితాలను ఇస్తాయి? ఇలాంటి అనేక ప్రశ్నలకు ఈ కథలు సమాధానంగా నిలబడుతాయి. ఉద్యమాల చరిత్రను అర్థం చేసుకోవడానికి కూడా ఈ కథలు ఉపయోగపడతాయి. పనిపిల్ల కథమీద చాలాపెద్ద చర్చ జరిగింది. మీ అందరూ ఫాలో అయ్యే ఉంటారు. చాలా క్లిష్టమైన విషయం ఆ కథలో ఉంది. మానవ సంబంధాల్లోని ఆ క్లిష్టతను మనం యింకా ఛేదించాల్సే ఉందని నా అభిప్రాయం.

**ప్రొ. జి. హరగోపాల్**
*రాజనీతిశాస్త్ర ఆచార్యులు, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్*

*(విరసం ముప్పై అయిదేళ్ళ సందర్భంగా విరసం ఎలా ఉంది? ఎలా ఉండాలి? అనే అంశంపై జులై 31, 2005న జరిగిన సదస్సులో ఈ సంపుటిని ఆవిష్కరిస్తూ...)*



# కథాక్రమం

H ఈ సంపుటం గురించి — కృష్ణాబాయి
H స్వగతం — కాళీపట్నం రామారావు
H తుమ్మేటి రఘోత్తమరెడ్డీ-నేనూ — డా.ఎస్. సదాశివ
H ఇది పరిచయం కాదు — వల్లంపాటి వెంకటసుబ్బయ్య
H చిత్తడైన అంతరంగం — అల్లం రాజయ్య
H భిన్న భావజాలాల సంఘర్షణ — పాణి
H ముఖచిత్రం గురించి — బెజ్జారపు రవీందర్

1. ధిక్కారం 1
2. సవారి-□ □
3. సవారి-□□ □□
4. ఈ భూమి ఎవరిచ్చిన్రు 17
5. ఒక్కటైతే 34
6. పగలూరేయీ శ్రమ... 42

H H H

7. ఓ మెరుపు మెరిసింది 52

H H H

8. బొగ్గుపొరల్లో 58
9. నీళ్ల తగువు 84
10. ఇల్లు 90
11. పురుడు 100
12. పెండ్లి 106
13. నల్లవజ్రం 113
14. పట్టు 189
15. వాల్‌పోస్టర్ 199

H H H

16. ఉరి 208
17. చావువిందు 222

H H H

18. నా పాత స్నేహితుడు 241
19. వేటగాడి చూపులు 255
20. శత్రువు 263
21. జాడ 274
22. పనిపిల్ల 294
23. హంతకులు 321

H H H

24. నా రచనా నేపథ్యం 344
25. అభిమాన కథకుడికి ప్రేమలేఖ -ఎన్. వేణుగోపాల్ 382

# ఈ సంపుటం గురించి...

'ఇక ముందు తెలుగు సాహిత్య చరిత్ర రాసేవారెవరయినా సరే శ్రీశ్రీ సన్మానం (విశాఖపట్నం-1, ఫిబ్రవరి, 1970)కి ముందూ, తరువాతా అని యుగ విభజన చేయవలసి వుంటుంది. ఆనాడు కరీంనగర్ నించి వెలువడుతున్న సాహిత్య మాసపత్రిక 'విద్యుల్లత' చేసిన సంపాదకీయ సూచన ఇది. అందుకు అనుగుణంగానే కొన్ని నెలల తరవాత హైదరాబాదులో జులై 4న విరసం ఏర్పడింది. మరికొన్ని నెలల తరవాత విరసం తొలి మహాసభలు ఖమ్మం (అక్టోబరు రెండోవారం)లో జరిగాయి. 'ఝంఝ' విప్లవ కవితా సంకలనం కాపీలు శ్రీశ్రీ మద్రాసు నుంచీ మోసుకొచ్చాడు. ఖమ్మంలో రైలు దిగి ఆ సంకలనంలోని 'నరుడో భాస్కరుడా!' పాట పాడుకుంటూ నడిచి వచ్చాడు. ఆ మరుసటి ఏడాది సెప్టెంబరు ఆఖరి వారంలో విరసం మలి మహాసభలు హైదరాబాదు వీరశైవ హాస్టలులో జరిగాయి. విరసం తొలి కథాసంకలనం 'ఇప్పుడు వీస్తున్న గాలి' వెలువడింది. దాని సంపాదకుడు కొడవటిగంటి కుటుంబరావు. తాను విప్లవకథలు రాయలేదు గనక ఆ సంకలనంలో తన కథ వేసుకోలేదు. ఈ సంకలనం ఆ తర్వాతి విప్లవ కథలకి వరవడి అయింది. 'అన్నిరకాల చైతన్యమూ జీవితం నించే పుట్టాలి. జీవితం దేశకాల ప్రభావాలకి అనుగుణంగా మారుతుంది. జీవితంలో కలిగే మార్పుల ప్రభావం సాంఘిక చైతన్యం మీదా, సాంఘిక చైతన్య ప్రభావం జీవితం మీదా ప్రబలంగా వున్నప్పుడే జీవితం ముందుకి పోతుంది' అంటూ దిశానిర్దేశం చేశారు కుటుంబరావు. ప్రజా జీవితపుదారుల్లో విరసం మమేకమయింది. లోతులు తరచి చూసింది. అందుకనే అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ- కవిత్వం, వచన సాహిత్యం, విమర్శ - విరసం విశేషమైన కృషి చేసింది. సాహిత్య రూప సారాల్ని మార్చి తనదంటూ ముద్రవేసింది. కవితా రంగాన్నే తీసుకుందాం. వచన కవిత్వం, పాట పందెం వేసుకు పరుగులు తీశాయి. ఏదేమైనా వచన కవితది నడక, పాటది పరుగు. వీటికి ఒరవడి మాత్రం 'ఝంఝ' అని చెప్పవచ్చు. అలాగే కథలకి 'ఇప్పుడు వీస్తున్న గాలి'. ఈ రెంటినీ ఆనాటి ప్రభుత్వం నిషేధించింది. అయినా వాటి ఉరవడిని అరికట్టలేకపోయింది. పైగా కథారచన మంచి నవలలు రావడానికి కూడా దారి సుగమం చేసింది. పల్లెల్లోవున్న ఆశు సంప్రదాయాన్ని విప్లవ నవలలు పుణికి



పుచ్చుకున్నాయి. అటు వచన కవిత్వం, పాట; ఇటు కథలు, నవలలు సాహిత్య విమర్శని దృఢమైన పునాది మీద నిలబెట్టాయి. ఈ మూడున్నర దశాబ్దాల తెలుగు సాహిత్య చరిత్ర తాలూకు రూపురేఖలివీ అని చెప్పవచ్చు. కాని చరిత్ర అక్కర్లేదన్నారు నారాగారు. ఆయనకన్నా ఒక ఆకు ఎక్కువ చదివిన వై.యస్.గారు సాహిత్యానికే ఎసరుపెట్టారు. సాహిత్య సంస్థని నిషేధించిన 'కీర్తి' పొందారు! నగారాని జోకొట్టడం, అలలని అరికట్టడం, గాలిని ఉరితీయడం వల్ల మాలిన పనులని తేలి పోయింది.

విప్లవ కథ మూలతత్వాన్నీ, దానిలోని మెళకువలని బాగా ఆకళింపు చేసుకున్న రఘోత్తమ్ గురించి ప్రత్యేకం చెప్పుకోవాలి. జీవితంలోని ఒత్తిడి, రాపిడి రఘోత్తమ్ స్వానుభవం లోనివి. మానవ సంబంధాల్లో వుండే సంఘర్షణ, సంక్లిష్టత అతనికి కొట్టిన పిండి. కార్మికుల బతుకుల్ని కళ్ళకుకట్టినట్టు చిత్రించగలడు. వాళ్ళ అంతరంగాల్లో పెనవేసుకుపోయిన చిక్కుముడుల్ని ఒడుపుగా విప్పగలడు. కొన్ని కథల్లో అతను చేసిన విశ్లేషణ నిశితంగా పరిశీలిస్తే ఇది ఇతనికి మాత్రమే సాధ్యం అనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో ధిక్కార సంప్రదాయం ఏదో ఒక మోతాదులో ఏనాటి నుంచో కొనసాగుతూనే వుంది. ఇది అందరూ గుర్తించిన అంశమే. ఈ ధిక్కార వారసత్వాన్ని సంతరించుకుంది విరసం. దీనికొక సవ్యమైన, సక్రమమైన నిర్మాణ రూపాన్ని తీర్చి దిద్దడంలో విరసం చొరవ తీసుకుంది. ఆధునిక యుగంలో ఇది చాలా అవసరం కూడా.

ఈ సంపుటిలోని తొలికథ 'ధిక్కారం' కావడం కేవలం యాదృచ్ఛికం కాదు. ధిక్కార సంప్రదాయాన్ని రఘోత్తమ్ పుణికి పుచ్చుకున్నాడు గనకనే ఇది సాధ్యమయింది. అక్కడితో ఆగకుండా 'చావువిందు' చవి చూపించి 'పనిపిల్ల'కి పట్టం కట్టాడు.

ఇవాళ కథాసంకలనాలూ, సంపుటాలు విరివిగా వెలువడుతున్నాయి. రఘోత్తమ్ సొంత పేరుతోనూ, ఇతర పేర్లతోను పాతికేళ్ళుగా కథలు రాస్తున్నా ఇవి సంపుటిగా మాత్రం ఇప్పుడే వెలుగుచూస్తున్నాయి. తెలుగు కథాసాహిత్యంలో రఘోత్తమ్ రచనలు ఏ విలువలకీ వికాసానికీ ద్వారాలు తెరుస్తాయో అందరం తెలుసుకోవడానికి ఈ సంపుటి దోహదం చేస్తుందని ఆశిస్తున్నాం.

ఇవాళ తెలుగు సాహిత్య సాంస్కృతిక కళారంగాల్లో సన్మానాలూ, దుశ్శాలువాలూ, అవార్డులూ, పారితోషికాలు విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. వీటిని విరసం తీవ్రంగా నిరసిస్తోంది, నిరాకరిస్తోంది. వ్యక్తిగతంగా రఘోత్తమ్ కూడా ప్రచారాలకీ, ఆర్భాటాలకి దూరం. అయినా విరసం ప్రచురణగా వెలువడే ఈ కథాసంపుటిలో ఇంతమంది ముందు మాటలు ఎందుకని ఎవరికైనా అనిపించవచ్చు. దీన్ని గురించి విడమర్చి చెప్పాలి.

విరసానికి అరలూ మరలూ దడులూ ఏనాడూ లేవు. తన చుట్టూ గిరి గీసుకుని విరసం ఎప్పుడూ కూచోలేదు. సాహిత్య లోకంలో అందరితో కలివిడిగా కార్యక్రమాలు

నిర్వహిస్తూనే వున్నాం. విరసం ఎప్పుడూ ప్రతిస్పందన (ఫీడ్‌బాక్)ని ఆహ్వానిస్తుంది.

రఘోత్తం కథలు ఉత్తర తెలంగాణా విప్లవోద్యమ నేపథ్యంలో రూపొందినవి. కాబట్టి వీటి గురించి సాహిత్యమిత్రులు ఏ అంచనా యిస్తారో తెలుసుకోవాలనుకున్నాం. అందుకే ఇందరి అభిప్రాయాలు కోరి ప్రచురించాం. వారికి మా కృతజ్ఞతలు.

ఈ సంపుటి ముందు వెనకల గురించి కొంచెం చెప్పాలి. విరసం మూడున్నర దశాబ్దాల సభలు 2005 జులై 2న హైదరాబాదులో మొదలై, 4న నెల్లూరులో, 23న విశాఖలో, 24న విజయవాడలో జరిగి, 31న హైదరాబాదులో ముగిశాయి. ముగింపు సభలో రఘోత్తమ్ కథాసంపుటిని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవిష్కరించారు. ఆనాటి కోసం కొద్ది కాపీలు తెచ్చాం. ఆ వెంటనే నిషేధం విరుచుకుపడింది. అందువల్ల ఇప్పుడే ఈ కాపీల్ని విడుదల చేయగలుగుతున్నాం.

చిన్న వివరణ: ఇందులో చిట్టచివరి కథ 'హంతకులు'. రచయిత తన 'రచనా నేపథ్యం' దీనికన్నా ముందే రాశాడు.

నవంబరు 17, 2005.

**కృష్ణాబాయి**

*ప్రధాన కార్యదర్శి, విరసం*



# స్వగతం

'సంశయాత్మ వినశ్యతి' అన్నారట పెద్దలు. ఈ విషయం అర్థశతాబ్ది క్రితమే నేను గౌరవించే ఓ పెద్దాయన నాకు బోధించారు. కానీ అది నా జీవలక్షణం కావడం వల్ల ఇంతవరూ ఇందుకు సంబంధించిన లోపాన్ని సరిదిద్దుకోవడం నా వల్ల కాలేదు. అలా అని నా మానాన నేను బతకలేను.

మనిషిలో మనుష్యుల్లో కుటుంబాల్లో గుంపులలో సమాజాల్లో మానవలోకంలో జరిగే సంఘటనల గురించి ఘర్షణల గురించి ప్రచ్ఛన్న-బహిరంగ పోరాటాల గురించి ముందంజల గురించి వెనకడుగుల గురించి తెలుసుకోవాలనుకునే తపన వదలదు. ఇందుకు అందరికి లాగానే నాకూ ఉపాధి రేడియో, టి.వి., పత్రికలు, పుస్తకాలే. రాజకీయ నాయకులూ మేధావులూ బాధితులూ బాధకులూ – చేసే ప్రకటనలు ఉపన్యాసాలు రాసేరాతలు ఇచ్చే ఇంటర్వ్యూలు వగైరాలే. వాటితో పాటు సాహిత్యం, ముఖ్యంగా కాల్పనిక సాహిత్యం.

అయితే వీటిలో ఎక్కువ భాగం మనిషి పట్ల సత్యం పట్ల గల బాధ్యత గుర్తుంచుకున్న వేనా అని నాకనిపిస్తుంది. సత్యంపాలు కన్నా అబద్ధాలూ, కల్పనల పాలు ఎక్కువేమో అని కూడా అనిపిస్తుంది.

బహుశా వయసుతోపాటు పెరుగుతుందంటారే. ఆ సినిసిజమే కారణం కావచ్చు, కాకనూపోవచ్చు. బాధ్యతను గుర్తెరగడంలో, చిత్తశుద్ధిలో సాహితీకారులే తక్కిన వారిమీద కొంత నయమేమో అనిపిస్తుంది. వాళ్లల్లో మాత్రం ఉద్దండ పిండాలు లేరా? ఉన్నా వారి రచనలు నేనెరిగిన లోకం. అందుకే వాళ్లవి ఒకటి రెండు రచనలు చదవగానే ఎవర్ని పట్టించుకోవాలో ఎవర్ని పక్కకి పెట్టాలో తేల్చుకుంటాను. నా ఎంపిక, అవగాహనలు అన్నీ సరియైనవి కాకపోవచ్చు. కాని ఎంత సంశయాత్మ అయినా ఎక్కడో ఒక దగ్గర రాజీపడక తప్పదు కదా! అలాసాగుతోంది ఇన్నాళ్ల నా అవగాహనాలోకం.

ప్రపంచంలో ఎన్నోచోట్ల ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి. పెను పరిణామాలూ మానవ జీవితగతినే మార్చే సంఘటనలూ చోటు చేసుకొంటున్నాయి. భారతదేశంలోనూ తెలుగునాట ముఖ్యంగా తెలంగాణాలో కూడా. మీడియాను గమనిస్తూనే సాహిత్యం ద్వారా

అక్కడి పరిణామాలు అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను.

గత మూడు దశాబ్దాల్లో తెలంగాణా నుంచి చాలా సాహిత్యం వచ్చింది. అందుబాటులో వచ్చిన కాడికి, ఓపికున్నకాడికి, అందరి రచనలూ చదువుతూ పోయినా నిజం తెలుసుకోడానికి కొందరి రచనల మీదే ఆధారపడతాను. అది తప్పే కావచ్చు. చెప్పేను కదా. నా జీవలక్షణం విలక్షణం.

అలాంటి కొందరు రచయితలలో తుమ్మేటి రఘోత్తమరెడ్డి గారు ముఖ్యులలో ఒకరు. వారిని వ్యక్తిగతంగా కూడా ఎరుగుదును.

నేనెరిగిన రఘోత్తమరెడ్డి రాజకీయ నాయకుడుకాదు. మేధావి అసలేకాదు. ఉపన్యాసకుడుగా ఈ మధ్య నోరు విప్పుతున్నాడేమో కాని అతడు సదా శ్రోతే. కనడం, వినడం కొంత చదవడం వీటి వల్ల పొందిన దాన్ని తానెరిగిన జీవితాన్ని విశ్లేషించడానికి ఉపయోగించడం – తనను కదలించిన జీవిత శకలాలను వస్తువులుగా చేసుకొని కథలు రాయడం – ముఖ్యంగా వాటిని మోసుకు తిరగకపోవడం – అతనిలో నాకు బాగా నచ్చిన విషయాలు. నా దృష్టిలో రచయితగా చాలా అరుదయిన రచయిత – తుమ్మేటి రఘోత్తమరెడ్డి.

వ్యక్తి సంగతి అటుంచండి. అతనూ అతని లాంటి వారి కథల పట్ల నా ఆరాధనకు వారి గుణాలే కారణంకాదు. ఇలాంటి గుణాలు కల రచయితలు చేసే రచనల్లో చిత్తశుద్ధి ఉంటుందని నా నమ్మకం. వాటిల్లో చిత్రితమైన జీవితం సత్యానికి సన్నిహితంగా వుంటుందని నా నమ్మకం.

రచయితల పట్లా వారి రచనల పట్లా అంత గాఢమైన నమ్మకానికి కారణంఏమిటి?

రాజకీయ నాయకులు, మేధావులు మొదలైన వారిని కూడా నేను నమ్ముతాను. అయితే వారెంతటి చిత్తశుద్ధి కలవారైనా వారిది విహంగ వీక్షణం.

రఘోత్తమరెడ్డి లాంటి రచయితలు పుట్టి పెరిగిన ప్రాంతపు జీవితాన్ని పుట్టిన దాని సన్నిహితంగా గమనిస్తూ వదుగుతారు. ఓ ప్రాంతపు పరిస్థితులూ వైరుధ్యాలూ పరిణామాల వంటివి అర్థం చేసుకోవడంలో వారికున్న వెసులుబాటు విహంగ వీక్షకులకు ఉండదు.

ఇదంతా తప్పో ఒప్పో నేను చెప్పలేను. అది నా జీవలక్షణం.

**కాళీపట్నం రామారావు**

*(సుప్రసిద్ధ కథారచయిత, కథా నిలయం నిర్వాహకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, శ్రీకాకుళం.)*



# తుమ్మేటి రఘోత్తమరెడ్డీ – నేనూ...

దాదాపు పద్నాలుగేళ్ల క్రిందట తుమ్మేటి రఘోత్తమరెడ్డితో జాబుల ద్వారా పరిచయం కలిగింది. ఆ జాబులు కథల గురించి కాదు. కవితల గురించి కాదు. హిందుస్తానీ శాస్త్రీయ సంగీతం గురించి. అప్పట్లో నేను ఆంధ్రప్రభ వార పత్రికలో సీరియల్‌గా హిందుస్తానీ సంగీతం గురించి 17 వారాలు ముచ్చట్లు చెప్పినాను. ఎన్నో వారాలు రాయాలనుకున్నాను. కాని రాయలేకపోయినాను. అవి అక్షరాలా ముచ్చట్లే. ఒక ఘరానా గురించి కాని, ఒక రాగాన్ని గురించి కాని, ఒక గాయికను గురించి కాని, ఒక గాయకుని గురించిగాని రాయవలసినంత రాయలేదు. ఎవరికీ సంగీతం నేర్పటం నా లక్ష్యం కాదు. కొందరికైనా ఆ సంగీతం పట్ల ఆసక్తి కలిగించటమే నా ధ్యేయం. ఆ ముచ్చట్లే చాల మందికి నచ్చినాయి. కొందరు పత్రికకే జాబులు రాసేవాళ్లు. ఒకరిద్దరు నాకు నేరుగా జాబులు రాసేవాళ్లు. నేరుగా రాసే వాళ్లలో తుమ్మేటి రఘోత్తమ రెడ్డి ముఖ్యుడు. అతడు మంచి కథకుడని విన్నాను. అతని కథలు చదువ లేదు. అతడు నన్ను తరిమినట్లుగా ఎన్ని జాబులు రాసినాడంటే ఆ వయసులో నాకు విసుగు పుట్టవలసిందే. అప్పుడు నా వయసు 64 సంవత్సరాలు. అతని దగ్గర ఉన్న రికార్డులు, విన్న రికార్డులు, క్యాసెట్లు, ఎల్పీలు – వాటిల్లోని రాగాలు. "ఈ ఘరానాలంటే యేమిటి? ఆ రికార్డులో వున్న రాగమేమిటి? ఆ పాడిన గాయకి గొప్పదా? పాడిన గాయకుడు గొప్పవాడేనా?" ఈలాటి ప్రశ్నలతో వచ్చేవి అతని జాబులు. ఇతరుల లాగా నా ముచ్చట్లు బాగున్నాయని ఒక్క వాక్యం కూడా రాయలేదు. అయినా, కథకుడైన ఆ యువకుడు సంగీతం పట్ల చూపే అనురక్తి, ఆసక్తి, తెలుసుకోవాలనే జిజ్ఞాస చూస్తుంటే ముచ్చట వేసింది. ఓపికగా అతనికి జవాబులు రాసేవాన్ని. కొన్ని వందల పేజీలు రాసి వుంటాను. రెండు వందల దాక రాసి వుంటాను. అంతకంటె ఎక్కువే రాసినారంటాడు రఘోత్తమరెడ్డి. ఎప్పుడో ఓపిక సన్నగిల్లి నప్పుడు (అప్పట్లో వారం వారం రెండు పేపర్లకు సీరియల్‌గా రాస్తున్నాను. నాది చదువుకునే వయసుకాని రాసుకునే వయసు కాదు గదా), "అయ్యా రఘోత్తమ రెడ్డీ! నువ్వెట్లుంటావో నేను చూడక పోతిని. నేనెట్లుంటానో నువ్వు చూడక పోతివి. ముఖాముఖి మాట్లాడు కోవలసిన విషయాలు ఎంత కాలమని రాసుకుందాము? మా పెద్దబ్బాయి శ్రీవర్ధన దగ్గర

నూటాయాభై వరకు హిందుస్తానీ శాస్త్రీయ సంగీతం క్యాసెట్లున్నాయి. మీరే వచ్చి నా దగ్గర రెండు రోజులుంటే వాటిల్లోంచి కొన్ని వినవచ్చు. కొంత మాట్లాడుకోవచ్చు. నేను అతిగా రాయలేను. అందునా మీపేరు పలుకటానికి నోరు తిరగదు. రాయటానికి నా రెండువేళ్లు వంకర్లు పోతాయి. వ్యాకరణ దోషమున్న పేరు మీది." అని రాసినాను. తీరికతో వస్తానని రాసినాడు. రఘోత్తమరెడ్డి, రఘోత్తమరావు అనే పేర్లు కల వాళ్లున్నారు. హాయిగా రఘూత్తమరెడ్డి అంటే పలుకవచ్చు. రాయవచ్చు. వ్యాకరణం సమ్మతించే సంధి అది.

ఈ ముందు మాటలో నన్ను గురించి చాల రాసుకుంటున్నానని ఎవరూ అభ్యంతరం చెప్పరనుకుంటాను. ఎందుకంటే దీని శీర్షికలో "రఘోత్తమరెడ్డీ–నేనూ–" అనే రాసినాను. అల్లం రాజయ్య పేరు గూడ రాయాల్సి వుండె. ఎవరెవరి కథలో చదివి తానూ కథలు రాయాలనుకున్నప్పుడు అప్పటికే సుప్రసిద్ధ కథకుడైన అల్లం రాజయ్య అతనికి మార్గదర్శకుడైనాడు. గురువుగా కాదు. మిత్రుడుగా, అతని ప్రసక్తి వచ్చినప్పుడు రఘోత్తమ రెడ్డి "సారు" అంటారు. రెడ్డి నేపథ్యాన్ని తెలుసుకున్న అల్లం రాజయ్య సంవేదనాశీలమైన అతని స్వభావానికి తగిన ఏలాటి ఇతివృత్తాన్ని ఎన్నుకొని, ఏలాటి శిల్పంలో, ఏ భాషలో రాయాలో సూచించి వుంటాడు. అల్లం రాజయ్య తమ్ముల్లిద్దరు మంచి రచయితలే. రఘోత్తమరెడ్డిని కూడ తన తమ్ముడుగా భావించి వుంటాడు. రావిశాస్త్రి, కారా మాష్టారు, మధురాంతకం  రాజారాం లాంటి దిగ్గజాల పరిచయం చేసి వుంటాడు. కథల వర్క్‌షాపుల్లో తిప్పుతూ ఎందరో కథకుల, కవుల పరిచయం చేసి వుంటాడు. రఘోత్తమరెడ్డి కంటె ముందే అల్లం రాజయ్య మా యింటికి వచ్చినాడు. ఒక ఆదివారం, పట్టపగలు, వర్షంలో తడుస్తూ వచ్చినాడు. మా యిల్లు చిన్నది. పక్క గదిలో పగటి నిద్ర తీస్తున్నాను. ముందు గదిలో వున్న మా రెండవ అబ్బాయి రాజవర్ధన్ అతన్ని కూర్చోబెట్టి, నన్నులేపి, "బాపా! అల్లం రాజయ్యగారు వచ్చినారు." అని సంతోషంగా చెప్పినాడు. నిద్ర ముఖంతో అతన్నెట్లా పలకరించాలని పక్క నుంచే బాత్‌రూమ్‌కు వెళ్లినాను. అట్లా వెళ్తున్న నన్ను చూస్తూ, "బాగానే వున్నారు గదా – కాళోజీ, రామేశ్వరరావు లాగా, మధురాంతకం రాజారాంలాగా బాగానే వున్నారు గదా." అంటున్నాడు మా అబ్బాయితో అల్లం రాజయ్య. బాత్‌రూంలోంచి వచ్చి అతని పక్క కుర్చీలో కూర్చుండి, "నన్ను గురించి ఏమో అంటున్నారు? అన్నాను. మీకు చాల కోపమని విన్నాను. ఎవరి మీదయినా విరుచుక పడతారని విన్నాను. మీరేమో ప్రశాంతంగా వున్నారు. అన్నాడు. "ఈ ప్రచారం ఎవరు చేసినారో కాని అతిగా చేసినారు. పూర్తిగా అబద్ధం మాత్రం కాదు. కోపం రాని వాళ్లెవరు?" అన్నాను. వేరే మాటల్లో పడిపోయినాము. కథల గురించి గాని కథకుల గురించి కాని మాట్లాడుకోలేదు. ఎప్పుడు కలిసినా ఆ విషయం తప్ప అనేక విషయాలు మాట్లాడుకుంటాము. రాజయ్య



ఏది రాసినా బాగా రాస్తాడు. ఇంత పేరు ఊరికే రాలేదతనికి. రాజయ్య వెళ్లి, నేనంతగా ప్రమాదకరమైన మనిషిని కానని చెప్పినాడేమో రెండు మూడు రోజుల్లో రఘోత్తమరెడ్డి వచ్చినాడు. వెంట ఒక మిత్రుడు; ముళ్లపూడి సుబ్బారావు. అతడూ మంచి కథకుడే. కాని ఇప్పుడు రాయటం లేదట. వాళ్ల వెంట వాళ్ల కథా సంకలనాలు తెచ్చుకున్నారు. కథల గురించి మాట్లాడుకోలేదు. శాస్త్రీయ సంగీతాన్ని గూడ అంతగా వినలేదు వాళ్లు. కొన్ని గంటలుండి వెళ్లి పోయినారు. ఉన్నంత సేపు రఘోత్తమరెడ్డి మంచంలో ఒరిగి మాట్లాడినాడు. మేమిద్దరం కుర్చీల్లో కూర్చుండి మాట్లాడినాము. దీర్ఘకాయుడైన రఘోత్తమ రెడ్డి గోదావరిఖనిలోని బొగ్గు బాయిల్లో ఈగుతూ, దూరుతూ తట్ట మోసినందుకు అతని నరాలు పట్టు తప్పినాయి. చాలసేపు నిటారుగా కూర్చుండలేడు. బస్సులో దూరప్రమాణం చేయలేడు. రైలు ప్రయాణమే సుఖ మతనికి. తర్వాత మంచిర్యాలలో అల్లం రాజయ్య, రఘోత్తమరెడ్డి నావెంటే వుండే వాళ్లు. ఇదంతా ఇతరత్రా రాసివున్నాను. శ్రీకాకుళంలో కారామాష్టారు గారి కథానిలయం ఆరవ వార్షికోత్సవానికి వెళ్లినాను. దక్షిణాన తెలంగాణా సరిహద్దులు దాటని వాన్ని. తిరుపతికి కూడ వెళ్లలేక పోయినవాన్ని. మాష్టారు గారి ఆదేశాన్ని కాదనలేక చేతగాని నా శరీరాన్ని అల్లం రాజయ్య, రఘోత్తమరెడ్డి, కుమార్ అనే వర్ధమాన రచయితలకు అప్పజెప్పినాను. లింక్ ఎక్స్‌ప్రెస్‌లో నన్ను పడవేసి గమ్యం చేర్చినారు.

రఘోత్తమరెడ్డికి కొన్ని గంటలు నిటారుగా కూర్చోవటం ఇబ్బందికరం అన్నానా! అదొక్కటే కాదు. అతనికి మరిన్ని ఇబ్బందులున్నాయి. అవన్నీ ఉన్న ఇబ్బందు లేవో, ఉన్నట్లు కొన్నిటిని ఊహించి బాధ పడతారో తెలియదు. సంవేదనా శీలమనే మాట అన్నాను గదా. చాల మంచి మాట – మామూలు హిందీలో, ఉర్దూలో దానికి సమానార్థకమైన మాట దర్దీ. రఘోత్తమరెడ్డిలో మితిమీరిన సంవేదనా శీలత వున్నది. (అని నేననుకుంటాను) మితిమీరిన సంవేదనాశీలత అంటే తేలికగా తీసుకోదగిన కొన్ని అంశాలకు తీవ్రంగా స్పందించటం. చాల చోట్ల "నా ఒంటరితనం" అంటాడు. అతడెన్నడూ ఒంటరివాడు. కుటుంబంలో అందరి పట్ల అతనికి ప్రేమే. ముఖ్యంగా తలిదండ్రి పట్ల, చెన్నైలో చదువుకుంటున్న తన కొడుకు పట్ల అతనికి గల ప్రేమ మా ఫోన్ సంభాషణల్లోనే వెల్లడవుతుంది. "ఒంటరి తనంతో బాధపడిన కాలంలో" అంటే భావసామ్యత గల మిత్రు లెవరో అతని కంపెనీలో లేనప్పుడు అని భావం. ఆ భావసామ్యత ఏ కారణంగానైనా అటో ఇటో అయినప్పుడు ఆ మిత్రులకు దూరమై మళ్లీ ఒంటరి వాడవుతాడు. మళ్లీ కలుసుకుంటాడు. అతనిలో రసార్ద్రమైన హృదయమున్నది (అందుకే సంగీతం పట్ల అంతటి అనురక్తి) ప్రేమ వున్నది. మానవత వున్నది. అతడు జన్మించిన కాలము, ప్రాంతము అతనిలో మితిమీరిన సంవేదనాశీలత కలిగించినాయి. అది అతని

కథల్లో కనిపిస్తుంది.

"నేనొక సితార్ క్యాసెట్ తెచ్చినానండి. కొన్ని రాత్రులు నిద్ర పట్టలేదు. అదేమి రాగమో కాని సితార్ వాదన ప్రారంభం కాగానే జోలపాట వింటున్నట్లు నిద్రలో జారుకుంటాను." అని ఫోన్ చేసినాడొక నాడు. "అదే రాగమో కలిసి విందాం రా రఘోత్తం." అన్నాను. వచ్చినాడు. విన్నాము. ఎవరో గొప్ప ఉస్తాద్ సితార్ మీద వాయించిన మాల్ కౌంస్ రాగం. గాయకి అంగ్‌లో మనోహరంగా వాయించినాడు. ఆ ఉస్తాద్ పేరు యాదికి లేదు. ఉస్తాద్ విలాయత్ ఖాన్ శిష్యుడైవుంటాడు. మాల్‌కౌంస్ రాగాన్ని కర్ణాటక సంగీతంలో హిందోల రాగమంటారు. అంటే ఊయెల – బాగా వాయించే వాళ్లుంటే, ఆలాప్‌లోనే కళ్లు మూతలు పడతాయి. జోడ్‌లో నిద్ర ముంచుక వస్తుంది. ఝాలాలో గాఢనిద్ర. బాగా వాయించే వాళ్లుంటే, అతి సంవేదనా శీలత గల రఘోత్తమ్ రెడ్డి శ్రోతగా వుంటే ఆ రాగం సార్థక మవుతుంది. మాలాంటి వాళ్లం విని ఆనందించ గలం.

రఘోత్తమరెడ్డి సంవేదనాశీలత అతని కథల్లో కనిపిస్తుంది. కథ జెప్పే కళ అతనికి తెలుసు. నినాదాలుండవు–పర్ల్–ఎస్–బక్ తీవ్రమైన విషయాలను చాల నిర్లిప్తంగా చెప్పింది. కొన్ని సందర్భాల్లో తారా శంకర్ బెనర్జీ అంతే. ప్రేమ్‌చంద్ ఎక్కడా ఆవేశానికి రాడు. కాని వాళ్ల వాక్యాల్లో వాళ్ల మనసులోని క్షోభ వ్యక్తమవుతుంది. ఎవరి పద్ధతి వాళ్లది. ఒకరి నొకరు అనుకరించాల్సిన అవసరం లేదు. రఘోత్తమరెడ్డి ఏది చెప్పినా అబద్ధం చెప్పడు. అతనికి చేతకాదు. అతనికి కీర్తి కాంక్ష లేదంటే సరిపోదు, కీర్తికి దూరంగా పారిపోతాడు. ఎవరో అన్నట్లు, ఎవరో రాసినట్లు, అతడు చప్పట్లు కొట్టించుకునే వ్యామోహంలో ఏదీరాయడు. ఉర్దూ గజల్ కవుల చప్పట్లు కొట్టించుకోవటానికే గజళ్లు చదువుతారు. వాహ్వా అంటేనే వాళ్లకు ఉత్సాహం. తెలుగు కథకులు గూడా చప్పట్లు కొట్టించుకోవటానికి రాస్తారని ఇటీవలే తెలిసింది. రఘోత్తం ఆ మాట ఊహించనే లేదు.

**డా. ఎస్. సదాశివ**

*దీపావళి,* *(సుప్రసిద్ధ రచయిత, అనువాదకులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్,*

*నవంబరు, 2005* *ఆదిలాబాద్.)*



# ఇది పరిచయం కాదు

"ఉరి", చావువిందు", "శత్రువు", "జాడ", "హంతకులు" మొదలైన కథలు రాసిన తుమ్మేటి రఘోత్తమరెడ్డికి పరిచయం అక్కరలేదు. అతనికి పరిచయం రాయాలని ప్రయత్నించటం మనకంటే ఎత్తుగా ఉన్న భుజాన్ని తట్టాలని ప్రయత్నించటమే. కాబట్టి నేను రాస్తున్నది ప్రతిస్పందనేకానీ పరిచయం కాదు. రఘోత్తమరెడ్డి నేను గౌరవంతో అభిమానించే చాలాకొద్ది మంది రచయితల్లో ఒకరు. అతడు రాసిన కొన్ని కథలను గురించి నాకున్న □□□□□□□□□□□□□□నా అభిమానానికి కానీ, గౌరవానికి కాని అడ్డురావు. అసమగ్రతలేని విమర్శకుడు లేనట్టే అసమగ్రతలు లేని రచయిత కూడా ఉండడు. తనలో అసమగ్రతలు లేవనుకునే రచయితా, విమర్శకుడూ ఎదగలేకపోగా, క్రమక్రమంగా కుంచించుకు పోతారు. నా దృష్టిలో షేక్స్పియర్ అంతటి మహారచయితా లేడు. అన్ని అసమగ్రతలున్న రచయితా లేడు.

రఘోత్తమరెడ్డి తొలికథలు (1981–86) మధ్యకాలంలో రాసినవి) చదివినప్పుడు నాకు ఎంతో సంతోషమూ, విషాదమూ ఒకేసారి కలిగాయి. ఆశ్చర్యకరమైన రచనాశక్తి, తాను చిత్రిస్తున్న జీవితాన్ని గురించిన లోతైన అవగాహనా, దానికి తగిన పురోగామి దృక్పథమూ రచయితకు ఉండటం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. కొ.కు., చా.సో., రావిశాస్త్రి, కా.రా. ల నుంచి కొత్తకథల్ని ఆశించే అవకాశాన్ని పోగొట్టుకొని దిగులుగా ఉన్న నాలాంటి కథాభిమానుల్లో ఆశ రగిలించిన ఆనాటి కొద్దిమంది యువ రచయితల్లో రఘోత్తమరెడ్డి ముఖ్యుడు. కానీ అతని కథల నిర్మాణం నాకు నిరాశ కలిగించింది. అతని భావజాలం కథల మీద – ముఖ్యంగా కథల ముగింపుల రూపంలో – బలవంతంగా ఆరోపించినట్టు అనిపించి చాలా విషాదం కలిగింది.

కథ భిన్నస్వరాల కూడలిగా ఉండాలి. వాటిలో నుంచి కథావస్తువు సహజంగా, తనంతకు తానుగా రూపొందాలి. రచయిత స్వరం ఇతరుల స్వరాలను మింగి వేస్తున్నంత బిగ్గరగా వినిపిస్తూ, తన అభిప్రాయాలను బలవంతంగా రుద్దుతున్నట్టుగా వినిపించకూడదు. మొదటి నుంచీ చివరిదాకా రచయిత కంఠస్వరమే వినిపించే కథలను □□□□□□□□□□□□□□□□ అనీ, అనేక కంఠస్వరాల అంతర్గత సంఘర్షణలో నుంచీ ఒక స్వరం ప్రాధాన్యతను సంతరించుకొని, రచయిత స్వరంతో సంగమించే కథలను □□□□□□□□□□□□□□□ అనీ

అంటారు. □□□□□□□□□□□□□□□□□ కంటే □□□□□□□□□□□□□□□□□ నిస్సందేహంగా గొప్పవని అభిప్రాయం. అందుచేత రఘోత్తమరెడ్డి కథల్లో రచయిత స్వరమూ, ముగింపులూ నన్ను కలవరపెట్టాయి.

"ధిక్కారం"లో కుర్రవాడు సారడు దొరసాని బంగళా పాటకులవైపుగా తిరిగి మూత్రవిసర్జన చేయటం ('అంకుర్' సినిమాలో కుర్రవాడు దొర గడీ మీద రాయి విసిరినట్టుగా), "సవారీ"లో మరొక కుర్రవాడు ఓదెలు దొరబండి దిగి "తనోళ్ళు జరుపుకుంటున్న" సభవైపు పరుగుతీయటం, "ఒక్కటైతే"లో హమాలీల ఐక్యతను చూసి "రైతులూ అలాకలిస్తే ఎంత బావుంటుంది" అని ప్రధాన పాత్ర భావించటం, "ఇల్లు"లో గుడిసెలు పోగొట్టుకున్న కార్మికులు కంపెనీ ఆఫీసులో కాపురం పెట్టటం – ఇలా చాలా కథల్లో ముగింపు వైపుకు కథ నడిపిన విధానం నాకు సహజంగా అనిపించలేదు. ఈ కథలు □□□□□□□□□□□□□□□□□ నిర్వచనానికి దగ్గరగా ఉన్నట్టు అనిపించాయి. ఎన్నో పాజిటివ్ లక్షణాలున్న ఈ రచయిత కథానిర్మాణాన్ని గురించి తెలుసుకోవటం ఆలస్యం చేసి, అమూల్యమైన తన జీవితానుభవాన్ని వృధా చేసుకుంటాడేమోనని కాస్త భయపడ్డాను. కానీ అలా జరగలేదు. నా భయం అర్థంలేనిదని రఘోత్తమరెడ్డి అనతికాలంలోనే నిరూపించాడు. అలా నా భయాన్ని పటాపంచలు చేసిన రచన "నల్లవజ్రం".

"నల్లవజ్రం" (1987) లాంటి నవలను అంతను ముందు నేను ఏ భాషలోనూ చదవలేదు. యార్క్‌షైర్ బొగ్గుగనులను గురించి □□□□□□□□□□□□□□□□□ రాసిన "□□□ □□□□□□□□□□□□□□□□□□" లాంటి నవలా, □□□□□□□□□□□□□ రాసిన □□□□□□□□□□□□□ □□□□□□□□□□□ లాంటి యాత్రాగ్రంథమూ మనకు ఎప్పుడూ రావేమోనని బాధపడేవాణ్ణి. కానీ "నల్లవజ్రం" ఈ రెండు రచనల్నీ దాటి పోయింది. లెవెలిక్ నవల గని కార్మికుల జీవితాలను వాస్తవికంగా వర్ణిస్తుంది కానీ అందులో దృక్పథం లేదు. దృక్పథం ఉన్న ఆర్వెల్ కార్మికుల దైన్యాన్ని పట్టణాలలోని సామ్యవాద నాయకుల మీద రాళ్ళు రువ్వటానికి ఉపయోగించుకున్నాడు. ఈ రెండు లోపాలులేని "నల్లవజ్రం" నాకు ఎంతో సంతృప్తి నిచ్చింది. దీనికితోడు మాండలికాన్ని ఉపయోగించటంలో రఘోత్తమరెడ్డి కున్న నేర్పరితనం నన్ను ఆశ్చర్యపరిచింది. ఆనాడు చాలామంది తెలంగాణా రచయితలు గ్రాంధికం, కోస్తా వ్యావహారికం, తెలంగాణా మాండలికం కలగాపులగంగా ఉన్న సంకరభాషను రాసేవారు. ఈ బలహీనత రఘోత్తమరెడ్డిలో అరుదుగా తప్ప కనిపించేది కాదు.

"నల్లవజ్రం" తరువాత రఘోత్తమరెడ్డి కథావస్తువులకున్న మొత్తం సంక్లిష్టతను తన కథల్లోకి తీసుకురావటానికి గట్టి ప్రయత్నం చేశానని నేను నమ్ముతున్నాను. అప్పటి నుంచీ అతని కథను పద్ధతుల్లో అత్యంత నాజూకైన మార్పులు రావటం ప్రారంభించాయి. భావానికి కాకుండా భావం యొక్క చరిత్రకు ప్రాధాన్యత పెరిగింది. భావాలను అనేక పార్శ్వాల నుంచీ ప్రదర్శించగల సామర్థ్యం పెరిగింది. తన భావాలను నమ్మినవాళ్ళ మెప్పును



సంపాదించే స్థాయి నుంచీ అతని కథలు తన భావాలను నమ్మని వాళ్ళ ఆమోదాన్ని పొందే స్థాయికి ఎదిగి విప్లవ భావజాలానికి గర్వకారణమయ్యాయి. ఏ భావజాల సాహిత్యమైనా దాన్ని నమ్మేవాళ్ళ చేత భేష్ అనిపించుకుంటే చాలదు. దాన్ని నమ్మని వాళ్ళలో నమ్మకం కలిగించాలి. ఈ బాధ్యతను నిర్వహించిన కొద్దిమంది రచయితల్లో రఘోత్తమ రెడ్డి ఒకడు.

రెండవ దశలో రఘోత్తమరెడ్డి రాసిన కథల్లో ప్రధానమైనవి "ఉరి", "చావుచిందు", "జాడ", "పనిపిల్ల", "హంతకులు" "నల్లవజ్రం" నవలా, ఈ కథలూ ఏ రచయితకైనా, ఏ భాషకైనా గర్వకారణమైనవే. □□□□□□□□□□□□□□□□□ అన్న వర్గీకరణకు వీటిని మంచి ఉదాహరణలుగా కూడా చెప్పుకోవచ్చు.

ఆర్థిక ప్రయోజనాలు మానవసంబంధాలను విషపూరితం చేసిన తరువాత హత్యలకూ, ఆత్మహత్యలకూ మధ్య ఉండవలసిన విభజనరేఖ దాదాపుగా చెరిగిపోయిందన్న అంశాన్ని ప్రతిభావంతంగా ఆవిష్కరించిన కథ "ఉరి". సందిగ్ధమైన రామచంద్రం చావును చావు తరుముకొస్తున్న నారాయణ దృష్టికోణం నుంచీ చెప్పటం చేత ఈ కథను గొప్పశక్తి వచ్చింది.

దృష్టికోణాన్ని జాగ్రత్తగా ఎన్నుకోవటం చేత లక్ష్యం అద్భుతంగా కుదిరిన మరొక కథ "చావువిందు". ఉత్తర తెలంగాణాలో భూస్వామ్య వ్యతిరేక భూపోరాటాలకు భూస్వాములు అనేక రకాలుగా స్పందించారు. కొందరు పరాజయాన్ని అంగీకరించారు. కొందరు భూస్వామ్యతత్వాన్ని వదిలిపెట్టి పెట్టుబడిదారీ తత్వాన్ని స్వీకరించారు. కొందరు అసమర్థ దుర్జనులుగా మారిపోయారు. మరికొందరు భవిష్యత్తును ఊహించలేకుండా దిగ్భ్రాంతితో బాటల కూడలిలో నిలబడిపోయారు. ఈ వాతావరణాన్ని ఒకచావును ప్రతీకగా గ్రహించి భూస్వాముల దృక్పథం నుంచీ చెప్పిన కథ "చావు విందు" తన భావజాలానికి వ్యతిరేకులైన వారి దృక్పథం నుంచీ కథ చెబుతూ తన దృక్పథానికి హాని జరగకుండా రక్షించుకోవటానికి రచయితకు చాలానైపుణ్యం ఉండాలి. అలాంటి నైపుణ్యం గొప్పగా కుదిరిన కథ "చావు విందు". ఇది రఘోత్తమరెడ్డి కథల్లో నాకు చాలా ఇష్టమైన కథ. దీన్ని నేను ఇంగ్లీషులోకి అనువదించి □□□□□□□□□□□□□□□□□ అన్న సాహిత్య పత్రికలో ప్రచురించాను కూడా.

హింసా ప్రతిహింసల మధ్య ధ్వంసమైపోతున్న మానవ సంబంధాలను చిత్రించిన కథ "జాడ". ఇవి ఆగుతాయా? ఆగితే ఎప్పుడు ఆగుతాయి? లేక ఇవి రెండూ అనివార్యమా? హింస అనివార్య పరిష్కారమా? గమ్యమా? ఈ ప్రశ్నల్ని నిశ్శబ్దంగా అడిగిన కథ ఇది. కూల్చివేయబడింది సుజాత మేనబావ ఇల్లు మాత్రమే కాదు. సుజాత ఇల్లు కూడా. తమ్ముని జాడ వెదుక్కుంటూ వెళ్ళిన సుజాతకూ, సుజాతను వెదుక్కుంటూ వెళ్ళిన

ఆమె భర్తకూ ఏం ఎదురైంది? హింసే కదా? ఎంతో ఉద్విగ్నమైన కథనం తరువాత రచయిత జోక్యం చేసుకొని చేసిన వ్యాఖ్యానం ఎంతో అర్థవంతమైంది. "ఆరాత్రి అంత చప్పున తెల్లవారేటట్టు లేదు"ట. ఇక్కడ "రాత్రి" ఏమిటో, అది దేనికి ప్రాతినిధ్యం వహిస్తుందో పాఠకులు శ్రద్ధగా ఆలోచించాలని కోరుతున్నాను.

"పనిపిల్ల" మీద చాలా వాదోపవాదాలు జరిగాయి. వాటిలో పాల్గొన్న చాలామంది తమ అభిప్రాయాలకిచ్చినంత ప్రాధాన్యత కథకు ఇవ్వలేదనుకుంటాను. "కథ ఏం చెబుతోంది?"– అని సూక్ష్మంగా పరిశీలించే □□□□□□□□□□□□□ పద్ధతులు మనసాహిత్యంలో ఇంకా అభివృద్ధి చెందలేదు. మనమింకా రచనను వదిలిపెట్టి రచయితను విశ్లేషిస్తున్నాము. అందుచేత చాలామంది ఆ కథలోని సందిగ్ధత రచయిత దృక్పథంలో లేదనీ, కథా నిర్మాణంతో ఉందనీ గుర్తించలేక పోయారు. సాధారణంగా కథలోని వస్తువు □□□□□□ □□□□□□□□ కావలసిన అంశం కంటే ఇతర అంశాలు ఎక్కువగా □□□□□□□□ అయ్యాయని నేను భావిస్తున్నాను. ఈ సూచనను దృష్టిలో ఉంచుకొని ఈ కథను మరొకసారి శ్రద్ధగా చదవమని పాఠకులను కోరుతున్నాను.

అంటే శ్రద్ధగా చదవాల్సిన మరొకకథ "హంతకులు". ఇది రఘోత్తమరెడ్డి ఈ సంపుటిలో రాసిన చివరి కథ. "ఈనాటి సమాజంలో హంతకులు ఎవరు?" అని సామాజిక సంబంధాలను విశ్లేషించుకుంటూ వెళ్ళితే "హంతకులు కానిదెవరు?" అన్న మరొక ప్రశ్న ఎదురుపడవచ్చు. సరళమైన ప్రశ్నలకు సమాధానాలు వెదకటం ప్రారంభిస్తే సంక్లిష్టమైన ప్రశ్నలు ఎదురుకావటం ఆధునిక జీవిత విషాదం. ఈ కథలో ఈ రెండు ప్రశ్నల మధ్య ఇరుక్కున్న జీవితంలో మూడు చావులున్నాయి. అవి ఆత్మహత్యలేనా? తల్లీకూతుళ్ళ ఆత్మహత్యకు రాజ్యమూ, శారద ఆత్మహత్యకు వివాహం అన్న వ్యవస్థ కారణం కావా? అలాంటప్పుడు అవి హత్యలు కావా? వీటి మధ్య ఒక స్వాములవారి ఉపన్యాసమూ, ఒక పెళ్ళి ఊరేగింపూ సూచిస్తున్న వ్యంగ్యార్థం ఏమిటి? శారద వ్యక్తిత్వం ఎందుచేత ఛిద్రమైంది? తాను ఎవరికోసం ఒక లక్ష్యాన్ని ప్రేమించిందో ఆ వ్యక్తి ఆ లక్ష్యాన్ని త్యజిస్తే వివాహ వ్యవస్థకు లోబడి ఉన్న స్త్రీ వ్యక్తిత్వం ఛిద్రమై పోకుండా ఉంటుందా? ఇలా ఎన్ని ప్రశ్నలు! జీవితాన్ని గురించి ఎంత ఎరుక! జీవితమంటే ఎంతప్రేమ! గుంపులు గుంపులుగా చీలిపోతున్న మనుషుల్ని చూసి ఎంత ఆవేదన! తనలాగే పచ్చని పొలాలను వదిలిపెట్టి బొగ్గు గనుల్లో కొచ్చి బొగ్గుల మధ్య బొగ్గులా బతికే సోదరులంటే ఎంత అనుకంప! వీటన్నిటినీ కథలుగా అల్లాలని ఎంత తపన! వీటన్నిటి సమాహార రూపమే రఘోత్తమరెడ్డి సృజన. ఆలోచనాత్మకమైన దాని ఆర్ద్ర రూపమే మీ ముందున్న కథలు. రఘోత్తమరెడ్డి ఆలోచించే పద్ధతి కానీ, కథ రాసే పద్ధతి కానీ సరళరేఖా సదృశంగా ఉండవు. అతడు కథావస్తువుకు సంబంధించిన సర్వ సంకీర్ణతనూ కథలోకి తీసుకువచ్చి, విభిన్న కోణాల నుంచీ దాన్ని పరిశీలిస్తాడు. అందుచేత మీ ప్రిజుడిస్‌లను పక్కన పెట్టి, కథలో లోపలికి



వెళ్ళి, హృదయాన్నీ బుద్ధినీ ఐక్యం చేసి అర్థం చేసుకోండి.

కొందరు రచయితలు రచన మానేస్తే ఆశ్చర్యం కలగదు. మరి కొందరు మానేయకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. రఘోత్తమరెడ్డిలాంటి రచయిత రచన మానేస్తే ఆశ్చర్యమేకాదు, బాధ కూడా కలుగుతుంది. 1970లో చనిపోయిన □□□□□□□□□□□ తన చివరి నవలను 1924లో రాశాడు. ఆ తరువాత అతడు నవలా, కథా రాయలేదు. ఎందుకని ప్రశ్నిస్తే "జీవితం నాకు అర్థం కానంతగా మారిపోయింది, దాన్ని గురించి రాయలేను", అని సమాధానం చెప్పాడు. రచన మానివేయటానికి ఇదొక కారణం కావచ్చు. కొందరు రచయితలు తామే మారిపోవటం చేత రచన మాని వేయవచ్చు. తాము తమ రచనా జీవితంలో నమ్ముకున్న ఆదర్శాలు మృగతృష్ణలని తెలిసిపోయాక వారిలో సృజన ఇంటికి పోవచ్చు. రూపం □□□□□□మీద కంట్రోలు తప్పిపోవటం చేత మరికొందరు రచన మానివేయవచ్చు. ఏ కారణమూ లేని రఘోత్తమరెడ్డి ఎందుచేత మానివేసినట్టు? అతడు "నా రచనానేపథ్యం"లో రచనమాని వేయటానికి చెప్పిన కారణాలు ఆమోద యోగ్యమైనవి కావు. అవి రచన కొనసాగించటానికి కారణాలు కాగలవు కానీ మాని వేయటానికి కావు. అసలు రఘోత్తమరెడ్డికి తన రచనా నేపథ్యం రాయమని సలహా ఇచ్చిన వ్యక్తి ఎవరోకానీ అతనికి సృజన స్వభావం తెలియదు. కాలం కాని కాలంలో మనసును అలా లోడుకుంటే అందులోని జల ఎండి పోతుంది. ముప్పై ఐదేళ్ళ వయసులో రచయితలు సాహిత్య ఆత్మకథలు రాసుకోరు. ఆ పని క్రికెట్, ఫుట్‌బాల్, గోల్ఫ్ ఆడేవాళ్ళు చేస్తారు. అందుకు కారణం ముప్పై ఐదేళ్ళకు వారి 'టాలెంట్' ఇంకి పోతుంది. రచయితలకు అలాకాదు. ఆ వయసులో అపరిపక్వతను జయించిన సృజన వారిలో సర్వతో ముఖంగా వికసించటం ప్రారంభమౌతుంది. అప్పుడు ఎదలోని ఊట చెలమలోని నీటిని బయటికి చల్లుకుంటూ పోవటం రచయిత చేయవలసిన పనికాదు.

రఘోత్తమరెడ్డి తన కథల్లో ఆపినచోట జీవితం ఆగిపోలేదు. దిశ మార్చుకొని ఊహించని దిశలో వెళ్ళిపోవటమూ లేదు. ఈ పదేళ్ళ జీవితంలో వచ్చిన మార్పులన్నీ కొనసాగింపులే కానీ హటాత్ పరిణామాలు కావు. అన్నిటికంటే ముఖ్యంగా రఘోత్తమరెడ్డిలో సృజన ఇంకిపోయిన లక్షణాలు కనిపించటం లేదు. అందుచేత రఘోత్తమరెడ్డి తాను ఆపిన చోట ఆరంభించాలి. గౌరవంతో, ప్రేమతో, నమ్మకంతో చెబుతున్న ఈమాటను అతడు మన్నిస్తాడని ఆశిస్తూ–

**వల్లంపాటి వెంకటసుబ్బయ్య**

*(కథా రచయిత, సాహిత్య విమర్శకులు, అనువాదకులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్, మదనపల్లె, చిత్తూరు జిల్లా.)*

# చిత్తడైన అంతరంగం

రఘోత్తమ్‌ను నన్ను కలిపింది మా ప్రాంతంలో, మా కాలంలో కొనసాగిన భూస్వామ్య వ్యతిరేక ప్రజాస్వామిక ఉద్యమం. అప్పటికే (1981) తొలికథ 'ధిక్కారం' రాసిన అనంతరం రఘోత్తమ్ వెతుక్కుంటూ వచ్చి నన్ను కలిశారు. తెలంగాణా పల్లెల్లో కొంచెం చదువు ఒంటబట్టిన యువకులు ఊపిరిసలుపక – పల్లెల్లో ఇముడజాలని దురదృష్టకరమైన రోజులవి. 1981 నుండి 1997 దాకా అనగా సుమారు పదిహేను సంవత్సరాలదాకా 'ధిక్కారం' నుండి 'హంతకులు' దాకా రఘోత్తమ్ రచనావ్యాసంగం, మా సహచర్యం సాగింది.

తెలుగు ప్రాంతంలో అందులో ముఖ్యంగా తెలంగాణాలో జీవితం అనేక ముఖ్యమైన మలుపులు తిరిగిన కాలం అది. కరీంనగర్, ఆదిలాబాదు రైతాంగ పోరాటాలు ఉవ్వెత్తుగా ఆరంభమై – సింగరేణి బొగ్గు గనులల్లోకి విస్తరించి – దండకారణ్యంలోకి ప్రవహించి – ఇంటా బయటా అనేక ఆటుపోట్లకులోనై – ప్రజా ఉద్యమ రాజకీయాలు భారతీయ సమాజాన్ని, ఉద్యమాలను పునర్ నిర్వచించుకున్న కాలం. అంతర్జాతీయంగా రష్యా కుప్ప కూలడం, చైనాలో సరళీకృత ఆర్థిక సంస్కరణలు, గ్లోబలైజేషన్ వగైరా వగైరాల నేపథ్యంలో – అనేక దేశాలల్లో ప్రజాస్వామిక ఉద్యమాలు దశ దిశ నిర్దేశించుకున్న కాలం. ఒక్క మాటలో చెప్పాలంటే అంతర్జాతీయంగా, జాతీయంగా సంక్లిష్టమైన, పెను సంఘర్షణాత్మకమైన కాలం యిది. ఈ కాలంలోని అందరి యువకుల్లాగే – ముఖ్యంగా పల్లెల్లో మట్టిని తలకిందులు చేస్తూ పచ్చని పొలాల మధ్య స్వేచ్ఛగా జీవించాలనుకున్న కలల్ని, మొక్కల లేలేత చివుళ్ల వంటి కలలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయగా – రఘోత్తమ్ అనేక ప్రశ్నలతో – సాహిత్యంలోకి ప్రవేశించాడు. పైన ప్రపంచ వ్యాపితంగా జరిగిన పరిణామాలను తన చుట్టూ జీవించే మనుషుల్లో పసికట్టాడు. వాటి విశ్వరూపం తెలిసినా కొద్ది మరింత సంఘర్షణాత్మకమైంది అతని అంతరంగం.

ఉత్తరాంధ్రలో 1962 నుండి 1973 దాకా పల్లెలు అనుభవించిన చిత్తడి, ఒత్తిడి జీవితం గురించి 'యజ్ఞం' మరికొన్ని కథలు (ఇంచుమించు రఘోత్తమ్ రాసినన్ని కథలే రాసిన) శ్రీకాకుళపట్నం రామారావు మేస్టారు పుస్తకానికి ముందుమాట రాస్తూ రావిశాస్త్రిగారు "మనుషుల్లో దేవునిగా" అభివర్ణించారు. నాకు తెలిసిన మనుషుల్లో ఉత్తముడిగా రఘోత్తమ్ గురించి రాద్దామనుకున్నాను. లోపలెక్కడో సుళ్లు తిరుగుతోంది. నిజానికి మాకన్నా ముందు నడిచిన మేస్టారు మాతోపాటే నడిచిన రఘోత్తమ్ మనకాలపు మనుషులు–సహచరులు.



తన చుట్టూ విస్తరించి ఉన్న జీవితంపట్ల, తన జీవితం గురించి, తను ఏర్పరుచుకున్న దృక్పథం గురించి రఘోత్తమ్‌కు భ్రమలు లేవు. వ్యక్తుల వ్యక్తిగత ప్రవర్తన అనే సూక్ష్మదర్శిని ద్వారా సామాజిక జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేశాడు. తన నేపథ్యంలో వివరించి నట్టుగా సాధారణ జీవితానికి భిన్నంగా వ్యక్తమయ్యే ప్రతి విశేషము అతన్ని ఆలోచింప జేశాయి. భూస్వామ్యం ప్రజాస్వామికమయ్యే సుదీర్ఘ సంకుల సమరంలో ఎంతటి అంతర్, బాహిర్ సంఘర్షణను సమాజం అనుభవించ గలదో? ధిక్కారం, సవారి, ఈ భూమి ఎవరిచ్చింద్రు, ఒక్కటైతే, చావుచిందు, నా పాత స్నేహితుడు, జాడ, పనిపిల్లలో తీవ్రమైన మమేకత్వంలో, నిర్దాక్షిణ్యంగా ఒక క్రమానుగతమైన పరిణామంలో చిత్రించాడు. కనుకనే ఈ జీవితంలో ఉన్న వాళ్లందరు కలెవెలపడ్డారు – పనిపిల్ల కథమీద ఒక దుమారం అందుకు నిదర్శనం. భావజాల రంగంలో భూస్వామిక లక్షణాలను, ప్రవర్తనను, జీవితాన్ని దాని సంక్లిష్టతలు, మలుపులతో సహా చిత్రించడం తెలుగు సాహిత్యంలో అరుదు. సాధారణంగా ప్రజా ఉద్యమాల గతిక్రమాన్ని చిత్రించిన దానికన్నా ప్రజా ఉద్యమాల స్పర్శను, పాత సమాజపు విషాదకర నిష్క్రమణను విమర్శనాత్మకంగా చిత్రించడం చాలా కష్టం. అది తొందరగా ఆమోదం పొందే విషయం కాదు. కనుక రఘోత్తమ్ అన్ని కథల మీద పనిపిల్ల కథలాగా సమీక్ష జరుగాల్సిన అవసరం ఇప్పుడు మరీ ఎక్కువగా ఉంది.

ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలలోను, భావజాలంలోనూ ఇముడని అనేక మంది గ్రామీణ యువకుల్లాగే రఘోత్తం కార్మిక ప్రాంతంలోకి వలస వచ్చాడు. ఇక్కడ తను కోరుకుంటున్న అచ్చమైన, సృజనాత్మకమైన, కళాత్మకమైన జీవితంకోసం, మనుషుల కోసం, విలువలకోసం పరితపించాడు. ఈ తీవ్రమైన అన్వేషణ మూలకంగా అనేక యుద్ధాల్లోకి నెట్టబడినాడు. సంఘర్షించాడు. బొగ్గుపొరల్లో, నీళ్లతగువు, పట్టు, నల్లవజ్రం, ఉరి, హంతకులు లాంటి కథలు ఈ సంఘర్షణలోంచి రాసిన కథలు. సంఘర్షణలోంచి, అన్వేషణలోంచి తనకు తెలుస్తుండగానే అతని దశ, దిశ ఆయనను మరింత విషాదంలోకి, ఒంటరితనంలోకి నెట్టివేశాయి. ఒకప్పటి చార్వాకుడు, గౌతమబుద్ధుడు, సోక్రటీసుల నుండి ఈధార మావో, మన కాలపు వీరులదాకా చుట్టు ముట్టిన 'సృజనాత్మక జీవితాన్వేషణ' అతన్ని క్రమంగా మరింత సంఘర్షణ లోతుల్లోకి తీసుకపొయ్యాయి. ఈ స్థితి ఒక్క రఘోత్తమ్ స్థితి మాత్రమే కాదు... ప్రపంచ వ్యాపితంగా తీవ్రమైన సంక్షోభం యొక్క వూపిరాడని స్థితి ఇది. పెట్టుబడి, సామ్రాజ్యవాదంగా రూపాంతరం చెంది – ప్రపంచాన్ని యుద్ధాలలోకి నెట్టిన కాలమిది. ఎదురిస్తే హత్య చెయ్యి, అమోదిస్తే వాళ్లే ఆత్మహత్యలు

చేసుకునే ప్రణాళికలతో ప్రపంచ బ్యాంకు అన్ని దేశాలల్లోకి పాకుతున్నా కూడా సంఘటితంగా ప్రతిఘటించలేని నిస్సహాయ సంధి సమయమిది.

అక్కడ మొదలైన అన్వేషణ మరింత పదునెక్కి వేటగాడి చూపులు, నాపాత స్నేహితుడు, చావువిందు, పనిపిల్ల, జాడ నుంచి 'హంతకుల' దగ్గరికి చేరుకున్నాడు. హంతకుల మధ్య జీవిస్తున్నామనే ఎరుక లూషన్ 'పిచ్చివాడి డైరీ' కథలోలాగా మహా యాతనామయమైంది.

ఈ నేపథ్యంలో వ్యక్తిగత జీవితాలు, సామాజిక జీవితాలు ఏ మలుపులు తిరుగుతాయో రఘోత్తమ్‌కు ఏ భ్రమలు లేకుండా స్పష్టంగా తెలుసు. ఈ మలుపు పరమ భయంకరమైనదే అయినా సాహసోపేతమైన మలుపు. మా దురదృష్టవశాత్తు ఈ చారిత్రక విషాదకరమైన సంఘర్షణ సన్నివేశంలోకి నడిచి చనిపోయిన వారు ఎందరో మా కాలంలో ఉన్నారు. ఎప్పటి నుండో ఈ ఘోర పరిణామాలు రాయడానికి చేతులు రాక, ఈ దురదృష్టకరమైన నేలమీద పుట్టిన నేను హత్య చేయబడిన అనేక మందిని (ఇక్కడ చాలా పేర్లు అందరికి తెలుసునని రాయడం లేదు) ఆత్మహత్య చేసుకున్న సుద్దాల ధర్మయ్య, (మన రెక్కల కష్టంతో బిర్లాలు బిల్డింగులు కట్టి అనే పాటకట్టి నాయన) చందుపట్ల కృష్ణారెడ్డి, ఊరుగొండ రమ, సౌభాగ్యవతి లాంటి వాళ్ల అంతర్గత సంఘర్షణను ఈ ప్రాంతంలో నివసించిన రఘోత్తమ్ అనుభవించాడు.

ఆయన ఈ మలుపుకు చేరుకున్ననాటికి అతని వయస్సు నలుభై లోపు. హంతకులతో తలపడి ఎడతెగని నిరంతర యుద్ధాలు, వాటి ఫలితాలు అనుభవించి – పై రెండు దారులు కాక, జీవించడం ఇక్కడ అసాధ్యం – సర్దుకుపోగల స్థితి, సైజుకాదు. ఇక్కడ ఈ మలుపు దగ్గర సుదీర్ఘ యుద్ధాల పరంపరలోనే – నిశ్శబ్దంగా ఎవరికి వాళ్లమే తిరగడం – ఎప్పుడైనా ఎక్కడైనా కలుస్తే (మేం తప్పించుకు తిరుగుతున్న ప్రశ్నల సమారోహం.) రష్యన్ సాహిత్యం గురించో, హిందుస్థానీ సంగీతం గురించో మాట్లాడుకునే తీరుకు తోడు కాయగూర తోటల పెంపకం గురించి, పచ్చిఆకులతో స్వయంగా ఎరువులు తయారు చేసుకోవడం గురించి, ప్రకృతి వైద్యం గురించి, ఆహార నియమాలు వైద్యం – గురించి, మక్కజొన్న కంకుల గురించి, పండ్ల గురించి, వ్యాయామం గురించి చెప్పి – ఇవి తాత్కాలికంగా మనలను మనం రోజు కొద్దికొద్దిగా (ఎముకల్లోని భాస్వరం మండి) చావకుండా కొంతమేరకైన కాపాడుకోగలమని (చాదస్తంగా కనిపించినా కూడా) పదేపదే చెప్పే రఘోత్తమ్‌కు, శాకాహారిగా మారిన నేటి రఘోత్తమ్‌కు ఎక్కడో రోజుకొక హంతక స్వభావంగల శత్రువు తారసపడుతూనే ఉంటాడు.

మరింక రాయవల్సింది, రాయతగింది మరేమి లేదని రచనలు మానేసిన (నా రచనా



నేపథ్యం, హంతకులు) 1997 నుండి 2003 దాకా సుమారు అయిదు సంవత్సరాల కాలం, తీవ్రమైన ఒంటరితనంతో, మానసికంగా సిక్కై – తేరుకొని ఏర్పరుచుకున్న కఠిన నిర్ణయాలు, నియమాల మధ్య ఆయన పుస్తకం (దాదాపు అన్ని కథలతో) రాబోతోంది.

ఇక్కడి నుండి నేటి కాలంలో, వ్యక్తిగత జీవితాలు, సామాజిక జీవితం ఏ మలుపులు తిరుగగలవో? మాకిద్దరికి తెలిసినా మేమిద్దరం మాట్లాడుకోలేదు. బహుశా ఆ విషయం నాతో మాట్లాడడానికి అతను యిష్టపడటం లేదు. హంతక స్వభావం అంతటా వ్యాపిస్తోంది. హంతకులు తిరగే చోట మాట నిషిద్ధం. ఒక్కొక్కసారి అలాంటి హంతక స్థితి తన సహచరులకు సోకుతుందని, సోకిందని కాబోలు. హత్యల గురించి హంతకుల గురించి యుద్ధరంగంలో నిండా తలమునకలై కేవలం మాట్లాడి ఏం ప్రయోజనం అనైనా కావచ్చును.

నన్ను ఒకటి రెండుసార్లు తెలిసిన విలేకర్లు – ఒకప్పటిలాగా ఇప్పుడు రాయడం లేదని అడిగారు. రాయకపోవడానికి కారణాలు మామూలువని, ప్రపంచబ్యాంకు వెనుకబడిన దేశాలల్లో తన దోపిడిని విస్తరించడాన్ని వ్యతిరేకించిన వాళ్లను మూకుమ్మడి హత్యలు (రాజకీయ, మత, ముఠా, దేశాలమధ్య యుద్ధాలు, ఇరాక్, రకరకాల చట్టవ్యతిరేక ముఠాలు, తీవ్రవాద బూచీ ఇవన్నీ కూడా)... దానిపెత్తనాన్ని పెట్టుబడిని ఆహ్వానించి ఆమోదించిన చోట ప్రజలే మూకుమ్మడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని రాయాలి. క్రమ క్రమంగా ఒక వ్యాధిలాగా ప్రజల్లోకి పాకిపోతున్న ఈ హంతక స్వభావాన్ని బహిర్గతం చెయ్యాలి. ప్రపంచ వ్యాపితంగా ప్రజలు తమ విలువైన ఆవి ష్కరణను, సంస్కృతిని, సంపదను రక్షించుకోవడానికి ఐక్యంగా పోరాడాలి. ఈ ప్రయత్నం విస్తరించాలి.

రఘోత్తమ్ పుస్తకానికి ముందుమాట రాయాలని తెలిసి, మేము కలిసి పంచుకున్న ఆ కథల్లోని జీవితం పోటెత్తి – వారం రోజులు సోయిలేకుండా జ్వరపడ్డాను. ముసురు, ఇంటి ముందు శవాలు, అనేక చావులు, ఎంత పరిగెత్తి నా అందని, తప్పిపోయిన కలలు – ఇంకా... 1997 తరువాత రఘోత్తమ్ అనుభవించిన మానసిక స్థితి నాకు ఆలశ్యంగా రాగలదేమోనని భయపడ్డాను.

కథలు మీరెట్లాగు చదువుతారు. కథలకు జీవితానికి సంబంధించిన నేపథ్యంలోకి వెళ్లుతారు. కాని రక్తసిక్తమౌతున్న (కథల్లో మీకెక్కడా కనపడని) రచయిత అంతరంగం గురించి చెప్పకుండా ఉండలేక పోయాను.

ఇంత కాలానికి – ఒక కాలానికి, తరానికి ఊపిరియైన కర్కశమైన – అయినా వాస్తవమైన కథల పుస్తకానికి ఆహ్వానం పలుకుతూ...

బతకడంలో సంఘర్షణ అనివార్యమైంది. మనిషి అద్భుతమైన సృష్టికర్త, ఆదిమ

కమ్యూనిజం నుండి నేటి దాకా అనేక సమాజాలను సంస్కృతులను సృష్టించిన సంఘజీవి. ప్రకృతిని లొంగదీసుకున్నట్టుగానే – ఎప్పటికైనా హంతకులను, హంతక స్వభావాన్ని తుదముట్టించి అజేయుడుగా, చిరంజీవిగా... సమస్త సృజనాత్మక శక్తులతో సహజీవనం చేయగలడని ప్రగాఢ విశ్వాసంతో.....

**అల్లంరాజయ్య**

*6 అక్టోబరు, 2005* *(సుప్రసిద్ధ కథా, నవలా రచయిత, మంచిర్యాల, ఆదిలాబాద్)*



# భిన్న భావజాలాల సంఘర్షణ

....రఘోత్తమ్ రాసిన కథలన్నింటినీ ఒక వరుస క్రమంలో తెలంగాణా రైతాంగ, ఆదివాసీ, కార్మికోద్యమాల బహుముఖీన కాల్పనిక వ్యక్తీకరణలుగా చదువుకోవచ్చు. ఆయన స్వీకరించిన పోరాట వస్తువులన్నీ కేవలం ఒక పోరాట ఘటనకో, ఉద్యమ శకలానికో పరిమితం కాక విప్లవోద్యమ నేపథ్యంలో మానవ సంబంధాల సంఘర్షణ మీద ప్రధానంగా ప్రసరించాయి. అల్లకల్లోలమై పోతున్న ప్రపంచాన్ని వివరించడానికి మానవ సంబంధాల పరిశీలనలోకి, మానవ అంతరంగ ప్రపంచంలోకి అడుగుపెట్టి అక్కడి నుంచి సమాజ చలనాలను, అభివృద్ధి విధ్వంసాలను విశ్లేషించే పనికి రఘోత్తమ్ పూనుకుంటారు.

ఆధిపత్యం, హింస, వైరుధ్యాలు ఏయే రూపాల్లో వ్యక్తంగా, అవ్యక్తంగా వున్నాయో, ఉండేందుకు అవకాశం వున్నదో గ్రహించడంలోనే దృక్పథం ఒక కచ్చితమైన గీటురాయిగా పనిచేస్తుంది. ఇట్లా వైవిధ్యం కోసం చేసే ప్రయత్నం అనివార్యంగా శిల్ప పద్ధతులను ప్రభావితం చేస్తుంది. ఈ నేపథ్యమే రఘోత్తంని సృజనకారుడిగా తీర్చిదిద్దింది.

కంటికి కనిపించే ఆధిపత్య వ్యవస్థలను, వాటి అణచివేతను కథలోకి తేవడం దగ్గర మొదలై, తర్వాతర్వాత కంటికి కనిపించని ఆధిపత్య రూపాల, స్వభావాల, ప్రత్యామ్నాయాల చిత్రణలోకి రఘోత్తం వెళ్ళిపోతారు. చాలా సందర్భాల్లో రఘోత్తం మానవ సంబంధాల ఉద్వేగాన్ని చిత్రించడం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టుంటుంది కాని, వాస్తవానికి అది అంతవరకే పరిమితంకాదు. మానవ సంబంధాలన్నిట్లో అలుముక పోయిన వర్గలక్షణాల వల్ల భిన్న విలువల, భావజాలాల మధ్య ఎడతెగని పెనుగులాట నుంచి పెల్లుబికే ఉద్వేగ ప్రవాహమిది.

చాలా సాధారణంగా వున్నట్టుండే ఏ ఇతివృత్తాన్నీ కూడా రఘోత్తమ్ అంత సరళంగా చూసి సరిపెట్టుకోలేదు. దాన్ని సమస్త సంక్లిష్టతల, వైరుధ్యాల ప్రాతిపదికల మీద నుండి కథల్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తారు. ఈ ప్రయత్నంలో ఏ చిన్న అంశాన్నీ విస్మరించకుండా జాగ్రత్తపడటం మాత్రమే గాక కథలోని సంక్లిష్టత్వాన్నీ, దాని బహుముఖీనతని అర్థం చేసుకోవడానికి అవసరమైన సరళతని కూడా అతి జాగ్రత్తగా పాటిస్తారు. చాలా అలవోకగా మొదలైన కథ అనేక మనస్తత్వాల మీదుగా ప్రసరించి

లోలోపలి సంఘర్షణలని వెలికి తీస్తుంది. ఈ క్రమంలోనే రఘోత్తమ్ పాత్రల మనస్తత్వం మీద, అంతరంగ చిత్రణ మీద శ్రద్ధ పెంచుకున్నారు.

కథా సాహిత్యంలో నిర్దిష్ట పాత్రల ద్వారానే కథ నడుస్తుంది. తాను ఎంచుకున్న వస్తువుకు అనుకూలమైన మనస్తత్వం గల పాత్రలను రఘోత్తం జాగ్రత్తగా రూపొందించు కుంటారు. సామాజిక, బాహ్య ప్రేరణలతో నిమిత్తం లేని మనస్తత్వ చిత్రణకూ, రఘోత్తం పాత్రల అంతరంగ చిత్రణకూ పోలిక లేదు. వ్యక్తిత్వ నిర్మాణానికీ, సామాజిక చలనాలకీ వుండే సంబంధంతో పాటు వ్యక్తిత్వం మీద సామాజిక సంచలనాల ప్రతిఫలనం కూడా ఆయన కథల్లోని ఒక ప్రత్యేక లక్షణం. 'జాడ' కథలోని సుజాత పాత్రని ఈ దృష్టిలో పరిశీలించవచ్చు.

ఇంటా బయటా రెండు పరస్పర విరుద్ధ విలువల మధ్య జరుగుతున్న సంఘర్షణ సుజాత వ్యక్తిత్వాన్ని కాంతివంతం చేస్తుంది. తమ్ముడికీ భర్తకీ మధ్య తలెత్తిన ఘర్షణని రెండు భిన్న ఆర్థిక రాజకీయ నమూనాల మధ్య పెనుగులాటగా చిత్రించే క్రమంలో వర్గ పోరాటంలో వుండే సున్నితమైన మానవీయ ప్రతిస్పందనలు ఆమెని ఎంతగానో ప్రభావితం చేస్తాయి.

రఘోత్తం కథల్లోని పాత్రలను, వాటి స్వభావాలను తెలంగాణా నేపథ్యం నుండి, మరీ ముఖ్యంగా తెలంగాణా సామాజిక వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యం నుండి పరిశీలించాలి. 'నా పాత స్నేహితుడు' కథ నుండి 'హంతకుల' దాకా ఆయన కథల్లో రూపొందిన పాత్రలను కేవలం నిజ జీవితంలోని వ్యక్తులు అని సరిపెట్టుకోవడం సాధ్యంగాదు. విప్లవోద్యమ నేపథ్యంలో తెలంగాణా సామాజిక సాంస్కృతిక రంగాల్లో జరిగిన పరిణామాల స్వభావాలను – రఘోత్తం కథల్లోని పాత్రల స్వభావాలను కలిపి పరిశీలిస్తే కథకుడిగా ఆయన మానవ జీవితాన్ని చూడటంలో సాధించిన పరిణతి కనిపిస్తుంది.

ఒక రైతుకూలి, కార్మికుడు, గృహిణి మొదలైన ఏ పాత్రలయినా సరే కథా సాహిత్యంలో నమూనా పాత్రలుగా తారసపడటం గమనిస్తూంటాం. నిజ జీవితానికి చాలా దగ్గరిగా వున్న పాత్రలయినా సరే ఈ నమూనా పాత్రల ద్వారా జీవిత సారాన్ని, సంక్లిష్టతను, వైవిధ్యాన్ని చిత్రించడం సాధ్యం కాదు. రఘోత్తం పాత్రలను గమనిస్తే ఏ రెండు పాత్రలమధ్య పోలిక కనిపించదు. వస్తువుకుండే నిర్దిష్ట స్థలకాలాల పట్ల రచయిత కున్న అవగాహన వల్ల పోరాట నేపథ్యంలో, ఉద్యమ పరిధిలో అనుకూలంగానో, ప్రతికూలంగానో ఉండే పాత్రలే అయినా వాటి మధ్య గొప్ప వైవిధ్యం కనిపిస్తుంది. నిజజీవితంలోని మనుషులను సాహిత్యంలో పాత్రలుగా మలచడంలో, అనేకమంది వ్యక్తులకు ప్రాతినిధ్యం వహించే పాత్రలను రూపొందించడంలో – నిజజీవితంలో బైటికి కనిపించే ప్రతిస్పందనలతో పాటు, అంతరంగ సంఘర్షణకు ప్రాధాన్యత యిస్తూ పాత్రలను నిర్మించడంలో రఘోత్తం చూపిన ప్రతిభ విప్లవ కథ పురోగమనాన్ని శక్తివంతం చేసింది.



మొత్తంగా కథా రచనలో రఘోత్తంరెడ్డి సాధించిన విజయాలను తెలంగాణ సమాజ సాహిత్య సంబంధాల నేపథ్యంలో, వర్గపోరాటంలో భాగంగా వివిధ సామాజిక బృందాల ఆరాటాలు, సంఘర్షణల నేపథ్యంలో వివరించనప్పుడే యిప్పటికీ తెలియని అనేక విషయాలు వెలుగులోకి వస్తాయి. తెలంగాణ ఆర్థిక రాజకీయ సంఘర్షణల పునాది మీద ముఖ్యంగా రైతులను, కార్మిక ఉద్యమ సంచలనాల ప్రాతిపదికమీద రఘోత్తం కథలను, వాటిలోని వస్తుశిల్ప పరిణామాలను చర్చించడానికి యింకా పూనుకోవలసే ఉన్నది. ఆర్థిక, రాజకీయ సంఘర్షణలు మానవ సంబంధాల సారంలోను, మానవ అంతరంగంలోనూ తీసుకొని వచ్చే మార్పులను అధ్యయనం చేయడానికి రఘోత్తం కథలు సృజనాత్మక సాధనాలుగా ఉపయోగపడతాయి.

తెలంగాణా గ్రామీణ, ఆదివాసీ, కార్మిక జీవితాలనూ, వాళ్ళ జీవన్మరణ పోరాటాలనూ, హత్యలూ, ఆత్మహత్యలనూ కథలుగా మలచడంలో వర్గపోరాటం మానవ సంబంధాలన్నింటిలో ఎన్నెన్ని రూపాల్లో ప్రతిఫలించేందుకు అవకాశం వున్నదో ఒక సృజనకారుడిగా అన్వేషించి చిత్రించగలిగారు రఘోత్తమ్.

*( 'తెలుగు కథకులు-కథనరీతులు 4' లో అచ్చయిన వ్యాసం నుండి కొంతభాగం, విశాలాంధ్ర ప్రచురణ)*

**పాణి**

*(కథా రచయిత, సాహిత్య విమర్శకులు,*
*కర్నూలు.)*

# ముఖచిత్రం గురించి

రఘోత్తమరెడ్డిగారి కథల పుస్తకానికి ముఖచిత్రంగా వేసిన పేయింటింగ్ పేరు "తెలంగాణ గ్రామీణ పెళ్ళి ఊరేగింపు". దీనికి మరోపేరు "వైరుధ్యాలు".

నెలల తరబడి ఈ పేయింటింగ్ రూపొందిన క్రమంలో నేను ప్రేక్షకుడిగా పాల్గొనే అవకాశం కలిగింది. పైకి చూస్తే ఇది మామూలుగా కనిపించే పెళ్ళి ఊరేగింపు. గ్రామీణ వైరుధ్యాలు అన్న స్పృహతో చూస్తే కానీ ఈ పెయింటింగ్ యొక్క విస్తృత, లోతూ అర్థం కావు.

ఈ దృశ్యంలో సమస్త గ్రామీణ జీవితపు తీరుతెన్నులు... అదీ వివాహం ద్వారా వివాహ వ్యవస్థ... లేదా మొత్తంగా ఒక దీర్ఘకాలపు సామాజిక వ్యవస్థ కనిపిస్తాయి.

బహుశా పాతికేళ్ళ క్రితం, లేక వంద, రెండువందల ఏండ్ల క్రితం – తెలంగాణా లోని ఒకానొక పల్లెలో ఒక రాత్రిపూట పెళ్ళి ఊరేగింపు... అనేక సామాజిక అంతరాల దొంతరలు, వాటి స్థితిగతులు – రఘోత్తమరెడ్డిగారి సెకండాఫ్ కథల నిర్మాణం వంటిదే ఈ పెళ్ళి ఊరేగింపు చిత్రం. వీరి కథలకు భూమికలాంటి ఈ పెళ్ళి ఊరేగింపు పేయింటింగ్ రూపొందిన క్రమం నాకు మాత్రం ఒక □□□□□□□□□□□లాంటిది.

సుమారు ఎనిమిది నెలల క్రితం రఘోత్తమరెడ్డిగారు, నేనూ కలిసి అన్నవరం శ్రీనివాస్ ఇంటికి వెళ్ళాం. సంభాషణ సహజంగానే చిత్రకళ మీదికి మళ్ళింది. అతను గీసిన చిత్రాలన్నింటిని చూశాం. అవీ ఇవీ మాట్లాడాక రఘోత్తమరెడ్డిగారు తన 'డ్రీం పిక్చర్" అనదగ్గ ఒక బొమ్మ ప్రస్తావన తీసుకువచ్చారు. సమకాలీన తెలంగాణాలోని సుఖదుఃఖాలు పతాకస్థాయికి చేరిన సంఘర్షణలకు మూలాధారాలను పట్టించగలిగే పేయింటింగ్ గురించి వివరంగా మాట్లాడారు. తనకోసం వేసివ్వమని అడిగిన ఆ పేయింటింగ్ (అప్పటికి తన కథలకు ముఖచిత్రంగా వేయాలనే ఊహలేదు) గురించి ప్రతి సూక్ష్మాంశం అన్నవరం శ్రీనివాస్‌తో చర్చించారు. అది వింటుంటే ఒక మహత్తరమైన నవలకు సంబంధించిన 'స్కెచ్' చదువుతున్నట్లనిపించింది.



అన్నవరం శ్రీనివాస్ బాగా ఓపికగల చిత్రకారుడు. అయితే మేం చూసిననాటి ప్రకారం అప్పటికి అతను అబ్‌స్ట్రాక్ చిత్రాలు, కుడ్యచిత్రాలు వంటివి వేసి వున్నారు. ఈ చిత్రం అతను గతంలో వేసినవాటికన్నా భిన్నమైనది. ఇందులోని చాలా అంశాలు నిజానికి నాకూ శ్రీనివాస్‌కూ తెలియనివే.

ఈ చిత్రరచన నెలల తరబడి కొనసాగింది. చాలాసార్లు ఉన్నో మార్పులు చేయాల్సి వచ్చింది. మూలమలుపు నుండి కుడి ఎడమలుగా విస్తరించిన ఈ పేయింటింగ్‌లో తెలంగాణా గ్రామీణ జీవితానికి సంబంధించిన పలు వృత్తులు, పలు కులాల మనుష్యులు, వారు వాడే వస్తువులు, వాటి అలంకరణలు, వాతావరణం, మనుష్యుల ఆకారాలు, భంగిమలు, సామాజిక ఆర్థిక, సాంస్కృతిక వైరుధ్యాలు తెలిపే ఎన్నో అంశాల గురించి రఘోత్తమరెడ్డిగారి వివరణలు, సూచనల మేరకు ఒక ఆకృతి వచ్చింది.

చిన్న తేడాను కూడా రఘోత్తమరెడ్డిగారు ఎంతమాత్రం మినహాయించేవారు కాదు. ఈ విషయం ఒక్కోసారి నాకు కొంత వింతగా అనిపించేది. కాని దీనివల్ల వారి కథల పకడ్బంధీ నిర్మాణాల వెనుకవున్న శ్రద్ధ, ఓర్పూ అర్థమయింది.

అతిచిన్న □□□□□□□□□□□□ట్ల కూడా వారు పెట్టే శ్రద్ధ, అన్నవరం శ్రీనివాస్ పనితనం పేయింటింగ్ సమగ్రతను తీసుకువచ్చాయి. దొర గడి లోపల లీలగా కనిపించే దొరసాని నగలు, ఆమె వెనకాల దూరంగా, ఇంకా లీలగా కనపడే పాలేరు, చేతిలోని కాగడా పట్ల కూడా శ్రద్ధను, నేర్పును కనపరచారు.

పేయింటింగ్‌లో ఇపుడు కనిపిస్తున్న ఒక్కో మనిషి గురించి, వారి జీవితాల గురించి ఎన్నో కథలు రఘోత్తమరెడ్డిగారు చెప్పేవారు. మంగలి, సుంకరి, చాకలి, దాసీ, ఆ భూస్వాములు, ఇండ్ల బయట నిలబడి ఊరేగింపును చూస్తున్న రైతులు, షావుకారి కుటుంబం, ఆ ఇంటావిడ బొడ్లో దోపుకున్న తాళం చెవిల గుత్తి, గౌండ్లోల్లు... ఇలా ప్రతి వ్యక్తి గురించి వారి రఫ్ స్కెచ్ తయరయ్యే కన్నా ముందే తన అనుభవాల నుండి చెప్పేవారు.

నిజానికి నాకది పేయింటింగ్‌లా అనిపించలేదు. ఒక విస్తృత కాన్వాస్ గల మన మహాభారతమో లేక టాల్‌స్టాయ్ యుద్ధం – శాంతి లాంటి నవలో అనిపించేది. ఒకే సమాజంలోని రెండు ప్రపంచాల గురించి, నేడు రకరకాలుగా వ్యక్తమవుతున్న పరిణామాలు... వంద ఏండ్లుగా రూపొందిన సామాజిక, ఆర్థిక అంతరాల గురించిన ఈ చిత్రం క్రమం నాకు సామాజిక శాస్త్రాల్ని అర్థం చేయించింది.

ఏలె లక్ష్మణ్‌ను ఈ పేయింటింగ్ గురించి అడిగి తన బిజీవల్లి కాదనిపించుకుని... ఏళ్ళ తరబడి రఘోత్తమరెడ్డిగారి మస్తిష్కంలో ఉండిపోయిన ఈ పేయింటింగ్ ఓపిక, నేర్పుగల అన్నవరం శ్రీనివాస్ ద్వారా ప్రపంచంలోకి వచ్చింది.

పేయింటింగ్ పూర్తవుతున్న దశలో దీన్ని చూసిన అల్లం రాజయ్యగారు ఇది రఘోత్తమరెడ్డిగారి కథలకు ఒక భూమిక లాంటి కథ అనీ, దీని తదనంతర పరిణామాల్ని చిత్రించిన కథల పుస్తకానికి ఈ పేయింటింగ్‌నే ముఖచిత్రంగా వేయడం సమంజసమని సూచించారు. ఈ పేయింటింగ్‌లోని దృశ్యం తెలంగాణ జీవితం. జీవితం అట్లా, అన్ని రకాల వైరుధ్యాలతో ఉండటం వల్లనే రఘోత్తంరెడ్డిగారి కథల్లో కనిపించే పరిణామాలు తప్పనిసరి అయ్యాయి. రచయితగా రఘోత్తంరెడ్డి ఆలోచనలకు, వైరుధ్యాల స్పృహకు చిత్రకారుడు గొప్ప దృశ్యరూపాన్నిచ్చాడు.

**బెజ్జారపు రవీందర్**

*(కథారచయిత, ఉపాధ్యాయుడు - పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా )*

# అభిమాన కథకుడికి ప్రేమలేఖ

హైదరాబాద్

జనవరి 20, 2006

ప్రియమైన రఘోత్తమ్,

నీ కథల సంపుటానికి సంపాదకుడిగా ఉండమని నువు అడిగినప్పుడు ఏ పనీ చేయకుండా కేవలం పేరు సంపాదించడం ఎందుకు అని మొహమాట పడ్డాను. వీలయితే నాలుగు ముక్కలు కూడ రాయమని అడిగినప్పుడు నీ స్వరంలో ధ్వనించిన ఆర్ద్రతకూ, ప్రేమకూ లొంగిపోయి నీ మీద ప్రేమతోనూ గౌరవంతోనూ ఒప్పుకున్నాను గాని నాకు అంత అర్హత లేదని నాకు తెలుసు. ఇరవైఐదు సంవత్సరాల పరిచయంతో నీ కథలలో, కథన పద్ధతిలో, లోతులో, విస్తృతిలో వచ్చిన పరిణామాన్నీ పరిణతినీ చూస్తున్న వాడిగా మాత్రమే ఈ నాలుగు మాటలు.

నీ గురించి, నీ కథల గురించి రాయాలంటే పురాస్మృతులెన్నో మదిలో మెదిలి కళ్ళు చెమ్మగిలుతాయి. కలిసి పంచుకున్న ఉజ్వల అనుభవాలు గుర్తుకొచ్చి, ఆ రోజులెంత బావుండేవి గదా అనిపిస్తుంది. రెండు దశాబ్దాలకు పైగా తరచుగానే కలుసుకుంటున్నా, సాహిత్య, సాహిత్యేతర విషయాలెన్నో మాట్లాడుకుంటున్నా నీకు నేనెంత దగ్గరికి రాగలిగానో నాకు తెలియదు. కాని 'ఈ పుస్తకంతో తప్పకుండా కొన్ని పేర్లు జోడింపబడి ఉండాలనుకుంటున్నాను. నీ పేరొకటి' అని నువ్వన్నప్పుడు నేను దాన్ని ఆదేశంగానే తీసుకున్నాను.

అంతేకాదు, 'పనిపిల్ల' కథ వచ్చినప్పుడు, దాని మీద హోరాహోరీ చర్చ జరిగినప్పుడు నేను బెంగళూరులో ఉండడం వల్లనో, మరే కారణం వల్లనో గాని ఆ చర్చలో పాల్గొనలేకపోయాను. ఆ కథను, అందులో నువు చెప్పదలచిన విషయాలను సమర్థిస్తూ రాయాలని చాలసార్లు అనుకుని, ఆలోచించి కూడా కాగితం మీద పెట్టలేకపోయాను. ఇప్పుడు నీ మీద, నీ కథల మీద నా ప్రేమనూ గౌరవాన్నీ ప్రకటించే అవకాశం వచ్చింది గనుక నీ ఆదేశాన్ని మన్నిస్తున్నాను.



ఇక్కడ అచ్చయిన 23 కథల్లో పది మొదటిసారి మన 'సృజన'లోనే అచ్చయ్యాయి. అంటే ఆ కథలన్నిటినీ కూడ అచ్చుకు ముందే చదివే అవకాశం నాకు దొరికింది. సాహితీ మిత్రుల రచనల ఎంపిక సమావేశాల్లో ఆ కథలు చదవడం, చర్చించడం, మార్పులు, చేర్పులు చేయడం దగ్గరి నుంచి వాటి ప్రూఫులు దిద్దేదాకా, ఇప్పుడిక్కడ మరోసారి చదివేదాకా ఆ కథలను అనేక సార్లు చదివి ఉంటాను. మిగిలిన కథల విషయమూ అటూ ఇటూగా అంతే. దాదాపుగా చదివిన ప్రతిసారీ ఆశ్చర్యపోతూ, ఆనందిస్తూ, పగలబడి నవ్వుతూ, పళ్ళు పటపటకొరుకుతూ ఉండి ఉంటాను. అన్నిటికన్న ఎక్కువగా ఎక్కడో ఒకచోటనో, అనేక చోట్లనో కన్నీళ్ళు కార్చి ఉంటాను.

అట్లాగే గుర్తుందా, ఇక్కడ అచ్చవుతున్న నవలిక 'నల్లవజ్రం' అచ్చుపని నేనే చూశాను. అప్పుడు బెజవాడలో ఉంటుండిన నేను ఆ పుస్తకం నాగేంద్ర ప్రెస్‌లో వేయించాను.

నీ కథల సమీక్షకు ఇది సమయం కాదు గాని భూగర్భంలో పొరలు పొరలుగా అల్లుకున్న బొగ్గుట్టలను చెమ్మాసుతో తోడినట్టే, మానవ సంబంధాలలో పొరలు పొరలుగా విస్తరించిన అనేక ఉద్వేగాలను నువ్వు కలంతో తవ్వి కథల కుప్పలు పోసినట్టనిపిస్తుంది. అందువల్ల ఎంత ప్రతిభావంతులయిన, ఎంత సునిశితమయిన సాహిత్య విమర్శకుల కయినా నీ కథల విశ్లేషణలో మిగిలిపోయే పొరలు ఉండనే ఉంటాయ నిపిస్తుంది.

నీ కథలకు ఈ లోతునూ విస్తృతినీ బహుళార్థ సాధకత్వాన్నీ అందజేసిన ధాతువు లేమిటా అని ఆలోచిస్తున్నాను. బహుశా నీ కథల కన్న ముందు నీ జీవితాన్ని అర్థం చేసుకోవాలనుకుంటాను. దాదాపు పదేళ్ళ కింద ఎక్కడో ఒక కథల పాఠశాలలో మనం విడిగా మాట్లాడుకుంటున్నప్పుడు మనలో ప్రతి ఒక్కరి జీవితాలు అందరికీ తెలియాలన్నావు. ఇప్పటికీ నువు గడిచివచ్చిన జీవితం తెలియదు గాని నీ రచనానేపథ్యాలు చదివితే కొంతయినా తెలుస్తుంది.

నీ నేపథ్యం చదివి, ముఖ్యంగా మట్టితో, మొక్కలతో, ప్రకృతితో, మీ బాపుతో నీ అనుబంధం చదివి ఏడ్చాను. ఏడుస్తూ చదివాను. అడుగడుగునా మా బాపు గుర్తొచ్చాడు, నా బాల్యం గుర్తొచ్చింది.

ఇప్పుడు నీ రచనా నేపథ్యాన్నీ నీ కథలనూ కలిపి చూస్తే ఆ జీవిత కథే నీ కథలన్నిటి వెనుకా సగర్వంగా, విశాలంగా నిలబడిన కాన్వాస్ అని అర్థమవుతోంది. ఆ కాన్వాస్ మీద నేపథ్యవర్ణం ఒక్కోసారి పరుచుకున్న కన్నీటి విషాద వర్ణాతీత వర్ణం. ఒక్కోసారి ప్రకృతి నిండిన వందలవేల ఛాయల ఆకుపచ్చని వ్యవసాయ వర్ణం. ఒక్కోసారి గ్రామీణ జీవన వైవిధ్య సంరంభంలోని సకల వర్ణాల సమ్మేళనం. ఒక్కోసారి ఆత్మ న్యూనతో,

బెరుకుతనమో, చొరవలేని తనమో బయటిప్రపంచంతో కలవలేక భయం భయంగా అంచులలో నిలబడిన పల్లెటూరి పిల్లగాడి అమాయకపు అనాచ్ఛాదిత వర్ణం. ఒక్కోసారి భూగర్భపులోలోపల కుతకుత ఉడుకుతున్న మహోగ్ర ఉష్ణపు నల్లబంగారపు అడ్డుగోడలాంటి వర్ణం. ఒక్కోసారి పల్లెనుంచి పట్నానికీ, అమాయకత్వం నుంచి చైతన్యానికీ, వయ్యక్తికత నుంచి సామూహికతకూ అటూ ఇటూ తండ్లాటతో తిరుగుతున్న శ్రద్ధాళువైన యువకుడి కుతూహలపు అరుణ వర్ణం.

ఇటువంటి సంపన్నమైన కాన్వాస్ నిజానికి చాల ఉద్వేగభరితమైన, విలాస భరితమైన కాన్వాస్. ఆ కాన్వాస్ మీద ఏ జీవిత శకలం చిత్రించినా దానిలో నిసర్గమైన సౌందర్యం పెల్లుబుకుంది. కళ్ళు చెదిరే వర్ణ సమ్మేళనం భాసిస్తుంది.

ఇంతకూ నువు రాసిన కథలు ఇరవైఐదు దాటలేదంటే ఆశ్చర్యం వేస్తోంది. నువు పట్టుదలగా కథలు రాసిన కాలం పదిహేడు, పద్దెనిమిదేళ్ళకు మించదేమో. కాని అది తెలంగాణ జనజీవనంలో అత్యద్భుతమైన కాలం. అతి భయంకరమైన కాలం కూడ. 'రెండు మహానగరాల', నాందీ ప్రస్తావనకు సరిగ్గా సరిపోయిన ఆ కాలంలో డికెన్స్ వలె అట్టడుగు గ్రామీణ జీవితాలనూ గాని కార్మిక జీవితాలనూ అవి దినదినం పొందుతుండిన సంచలనాత్మక పరిణామాలనూ నువు కథల కెక్కించావు.

సాధారణంగా 'సృజన' 'సాహితీమిత్రుల' రచనల ఎంపిక సమావేశాలలో కథలు చదివి వినిపించే పని రాంమోహన్‌కో, నాకో పడేది. నీ కథల్లో హాస్యం, వ్యంగ్యం, ఆ పాత్రల నిజజీవితాల్లో, సంభాషణల్లో చిప్పిలుతుండే హాస్యం బ్రహ్మాండంగా పండుతుండేది. ఆ పరిహాస సంభాషణలు–ముఖ్యంగా గనికార్మికుల సమావేశాల్లో వేరువేరు స్థాయిల గని కార్మికులు అలవోకగా ఉండీ ఉండీ, అప్పుడొకటి ఇప్పుడొకటిగా అంటించే మాటలు మా 'సాహితీ మిత్రుల' కథా పఠనాన్ని విద్యుచ్ఛకితం చేసేవి. ఆ సంభాషణా శకలం చదువుతూ చదువుతూనే నేను నవ్వాపుకోలేకపోయేవాణ్ణి. మన భాషలో చెప్పాలంటే పక్కడ పక్కడ నవ్వే వాణ్ణి. 'నవ్వడం పూర్తి చేసయినా చదువు. లేకపోతే చదివాక నయినా నవ్వు' అని వివినో, ఎన్‌కెనో, సుబ్బారావో హెచ్చరిస్తుండేవాళ్ళు. నీ మొదటి కథ 'ధిక్కారం' నుంచి ఆ తర్వాతి తొమ్మిది కథలు 'సాహితీ మిత్రులు'లో చదువుతుండిన ఆ అనుభవం నిన్నమొన్నటిది లాగే ఉంది.

నీ కథల్లో హాస్యం, వ్యంగ్యం గురించి చెపుతున్నాను గదూ – ఆ హాస్యం కేవలం హాస్యం కోసం కాదు. అది నువు చిత్రించిన జీవితాల్లో అనివార్యంగా, అంతర్భాగంగా ఉన్న హాస్యం. అది సరిగ్గా ఎంత ఉండాలో అంతే ఉండేది. ఆ పాత్రల్లో అమాయకత్వం, భూమి మీద, వ్యవసాయం మీద, శ్రమ మీద ప్రేమ, శ్రమ ఫలితం దక్కాలనే ఆరాటం క్రమక్రమంగా చైతన్యం పొందే తీరు, సంఘటిత కార్యాచరణలో భాగమయ్యే క్రమం–అన్నీ



సరిగ్గా కొలిచి పోసినంతగా ఉండవలసినంత ఉండేవి. వివేక వంతులయిన వృద్ధులు లోతయిన జీవిత సత్యాలను అలవోకగా చెప్పినట్టు చెప్పడం, అత్యంత విషాదభరిత సన్నివేశాలను సాంద్రంగా వ్యక్తీకరించడం– నీ కథల్లో ఎప్పుడు చదివినా నాకు కొత్తగా కనబడతాయి. ఆశ్చర్యపరుస్తాయి.

'ధిక్కారం', 'సవారీ' లాంటి సరళ, వయ్యక్తిక జీవిత కథల రోజుల నుంచీ, 'పనిపిల్ల', 'చావు విందు', 'జాడ' లాంటి సువిశాల, సంక్లిష్ట సామాజిక జీవితాల కథల వరకూ శ్రద్ధగా చదువుతూ, ప్రేమిస్తూ, అభిమానిస్తూ, గౌరవిస్తూ కూడ మన మధ్య బంధం ఎందుకు బలపడలేదో నాకెప్పుడూ ఆశ్చర్యంగా ఉంటుంది. బహుశా నీ ముడుచుకు పోయే, వెనక్కి జరిగే తత్వం తెలిసి కూడ కనీసం రెండుసార్లు నిన్ను తీవ్రంగానే గాయపరిచినట్టున్నాను. అందువల్ల కూడ మనం కావలసినంత దగ్గర కాలేకపోయా మనిపిస్తుంది. నీ నవలికను నీ పేరుతో కాకుండా మారు పేరుతో తెస్తున్నందుకు, అప్పటికే విప్లవసాహిత్యానికి శత్రువులుగా కంకణం కట్టుకుని తీవ్రంగా నిందిస్తూ తిరుగుతున్న వాళ్ళను కేవలం వాళ్ళ కథల కోసం గౌరవించి, సన్నిహితంగా ఉన్నందుకు అప్పుడు నీ మీద నాకు కోపం వచ్చింది. ఆ రోజుల అతిశయం, అసహనం ప్రభావం అది. ఆ కోపాన్ని నీ మీదనో, అబంపి మిత్రుల మీదనో అవసరమైనదాన్ని కన్న ఎక్కువ తీవ్రంగానే చూపినట్టున్నాను. దాదాపు పదిహేను సంవత్సరాలు గడిచిపోయాక ఆ అభిప్రాయాల తప్పొప్పులు ఎట్లా ఉన్నా మానవ సంబంధాలలో ఆ అతిశయం, ఆ తీవ్రత అవసరం లేనివనే భావిస్తున్నాను. క్షమించు.

మన వరంగల్ అంచుల్లో పుట్టి గోదావరికి ఎదురెక్కినట్టు కరీంనగర్‌కు వలస వెళ్ళి, రైతు జీవితం నుంచి కార్మిక జీవితంలోకి విస్తరించి, జీవితం గురించీ, మానవ సంబంధాల గురించీ, రచన గురించీ, ఉద్యమం గురించీ ఎన్నెన్నో విలువైన లోతయిన ఆలోచనలు చేస్తున్న నువ్వు ఇటీవల కొంతకాలంగా కథలు రాయకపోవడం నీకు నువ్వే చేసుకుంటున్న అన్యాయమనుకుంటాను. తెలుగు కథాసాహిత్యానికి తెలిసి తెలిసీ చేస్తున్న లోటు అనుకుంటాను.

ఇంత అద్భుతమైన కలాన్నీ మేధనూ మరొకసారి ఇన్నాళ్ళ మౌనం తర్వాత, ధ్యానం తర్వాత ఇనుమడించిన శక్తితో మన ప్రజల కష్టాలనూ కడగండ్లనూ ఆనందాలనూ పోరాటలనూ చిత్రించడానికి ప్రయోగిస్తావనీ, ప్రయోగించాలనీ...

ప్రేమతో

**ఎన్. వేణుగోపాల్**

(కవి, సాహిత్య విమర్శకుడు, పత్రికా రచయిత, హైదరాబాద్)

ఆర్లవిద్యాభూషణ - ధర్మోపన్యాసకేరరి

బ్రహ్మశ్రీ జటావల్లభుల పురుషోత్తంగారి

శతజయంత్యుత్సవప్రారంభం

ఫిబ్రవరి 19వ తేది ఆదివారం

సాయంత్రం 5 గంటలకి

భారతీయ విద్యాభవన్, గీతా భవన్ హాల్,

బషీర్‌బాగ్, హైదరాబాద్ - 500 029.

అందరూ ఆహ్వానితులే

ఆర్లవిద్యాభూషణ - ధర్మోపన్యాసకేరరి

బ్రహ్మశ్రీ జటావల్లభుల పురుషోత్తం

తూర్పు గోదావరి జిల్లా నడవపల్లిలో 19.2.1906 వ తేది జన్మించిన జగమెరిగిన విద్వాంసుడు శ్రీ పురుషోత్తంగారు - సంస్కృతాంధ్ర హిందీ ఆంగ్ల భాషల్లో అసాధారణ మేధాపాండిత్యాలు కలిగిన ఆయన నాలుగు భాషల్లోనూ అనర్గళ వాగ్పటిమగల మహోపన్యిసకులు - దాదాపుగా అర్ధశతాబ్దం పాటు దేశం నలుమూలలో ధార్మిక ఆధ్యాత్మిక సాంఘిక సాహిత్య వైదిక ఉపన్యాసాల్తో శ్రోతల్ని సమ్మోహన పరచారు - ఆంధ్రదేశంలో అధర్వ వేదాన్ని సముద్ధరించారు. వేలాది వ్యాసాలూ, మిర్మనా లేఖలు కాక భారతీయ విజ్ఞానం. భారతీయ వైభవం హిందూమతం - మహాకవి సందేశాలు చిత్రశతకం జగద్గురు ప్రశస్తి రేడియోలి ఉపన్యాసాలు మొ. 12 పుస్తకాలు వెలువరించారు. విజయవాడ కాలేజిలో లెక్చరర్‌గా. కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ పీఠం ప్రిన్స్‌పాల్‌గా పనిచేసి, ఎందరో సంస్కృతాంధ్ర పండితుల్ని, గురాస్థానంలో నిలబెట్టారు - క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని... కారాగారంలో ఉన్న దేశభక్తి పరాయాణులు పురుషోత్తంగారు.

సభా కార్యక్రమం

సభాధ్యక్షులు

శ్రీ భండారు సదాశివరావు

అడ్వకేటు, వరంగల్ (అఖిల భారత సాహిత్య పరిశీలపుర్వాధ్యక్షులు)

గౌరవ అతిథులు

మహామహోపాధ్యాయ ఆచార్య శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు

సంస్కృతోపాధ్యాపకులు

జటావల్లభుల పురుషోత్తం స్మారక ఉపన్యాసం

శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

వ్యవస్థా సంపాదకులు ఋషిపీఠం మాసస పత్రిక

శ్రీ జటావల్లభుల జగన్నాథం పురుషోత్తమ వైభవం

పుస్తకావిష్కరణ

కేసెట్ నుంచి పురుషోత్తం గారి అమృతవాణి

సాంస్కతిక కార్యక్రమం

సా. 5 గం.ల నుండి 5.30 వరకు

చి. మేడూరి సాయికిరణ్‌తో వీణావాదనం-మృదంగధ్వానం-గాత్రం

అనంతరం విజయసూర్య అవార్డు ప్రదానం

ఆసందర్భంగా

బ్నిం రచించిన